VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
శనివారం 11.04.2026
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH
సంపుటి: 07 సంచిక: 300
పేజీలు: 12 వెల: రూ. 5/-
Velthuru Newspaper

## జిహెచ్ఎంసిలో అవినీతి జరుగుతోంది : కవిత

2

- హెచ్ఎండిఏ పరిధిలో ప్రభుత్వ భూములు అమ్మకానికి పెట్టారు...





## రాష్ట్రపతిని కలిసిన రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా

2

హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 10, 2026:

తెలంగాణ గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీముర్ము గారితో భేటీ అయ్యారు. తెలంగాణ గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారి రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు.



## దేశంలోని రాష్ట్రాలలో చిన్న వయసు, నిర్ణయాలలో పెద్ద మనసు చాటుతున్న ప్రజా ప్రభుత్వం

3

- రైతుల పక్షపాతి ఈ ప్రభుత్వం మంత్రి తుమ్మల
- దేశంలోనే 2 లక్షల లోపు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం– మంత్రి తుమ్మల
- రైతులకు చేసే మేలు ఓర్వలేకే ప్రభుత్వంపై విమర్శలు – మంత్రి తుమ్మల
- రైతులపై కపటప్రేమ చూపెడుతున్న ప్రతిపక్ష నాయకులు – మంత్రి తుమ్మల
- బిఆర్ఎస్ నాయకుల విమర్శలకు మంత్రి తుమ్మల ఘాటు జవాబు



## ఇందిరా భవన్‌లో సీడబ్ల్యూసీ భేటీ

ఖర్గే అధ్యక్షతన జరిగిన సమావేశంలో అగ్రనేతల సమక్షంలో కీలక చర్చలు

- రాహుల్, ప్రియాంక సహా కీలక నేతలతో కలిసి చర్చల్లో పాల్గొన్న సీఎం
- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో భేటీ ప్రస్తుత రాజకీయాలపై సమీక్ష
- దేశ రాజకీయ పరిణామాలపై సీడబ్ల్యూసీలో కీలక అంశాల చర్చ

ఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 10:

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ప్రారంభమైన సిడబ్ల్యుసి సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, జైరాం రమేష్, సల్మాన్ ఖుర్షిద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేష్ బఘేల్ తదితర కీలక నేతలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కుతో కలిసి కీలక చర్చల్లో సీఎం పాల్గొన్నారు.

### మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు: సీఎం రేవంత్‌రెడ్డి

ఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 10:



మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతిస్తుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల కోసం బిల్లు తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని ఆయన అన్నారు. సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డి.. భేటీ అనంతరం ఇష్టాగోష్టిగా మీడియాతో మాట్లాడారు. "స్థానిక సంస్థల్లో మహిళలకు ..మిగతా 2లో



## "అన్నా.. నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని.."

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:

ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారితో ఎర్రవెల్లి నివాసంలో మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి..శుక్రవారం నాడు మర్యాదపూర్వక భేటీ అయ్యారు.. నివాసానికి చేరుకున్న జీవన్ రెడ్డికి, పుష్పగుచ్ఛాలందించి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే డా. కె. సంజయ్, మాజీ ఎంపీ ..మిగతా 3లో



## కేసీఆర్ ఫోన్, పరుగులు పెట్టిన ఆఫీసర్లు

- మాజీ సీఎం కేసీఆర్ ఒక ఫోన్ కాల్‌తో అధికార యంత్రాంగం చలనం
- సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ సాగర్ వద్ద ఘటన
- పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన
- కేసీఆర్ ఫోన్ తర్వాత వెంటనే అధికారుల అలర్ట్
- కొండపోచమ్మ సాగర్ నుంచి కాలువలకు నీటి విడుదల
- నీరు చేరడంతో రైతుల్లో ఆనందం
- ఘటన సోషల్ మీడియాలో వైరల్



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:

కేసీఆర్ ఫోన్, పరుగులు పెట్టిన ఆఫీసర్లు ఆయన అధికారంలో లేకపోవచ్చు.. కానీ ఆయన మాటకు ఉన్న పవర్ మాత్రం తగ్గలేదని మరోసారి నిరూపితమైంది. గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. పనులు పరుగులు పెడతాయని సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ సాగర్ సాక్షిగా తేలిపోయింది. "సారు ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు" అని విమర్శించే ప్రత్యర్థులకు, "ఆయన ఎక్కడున్నా శాసించగలరు" అని ..మిగతా 2లో

## ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ పెంపు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన
- 50.7% నుండి 52.8 శాతానికి చేరిన కరువు భత్యం.
- సంస్థపై నెలకు రూ. 2.82 కోట్ల అదనపు భారం.
- కార్మికుల సంక్షేమమే ధ్యేయం మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి వెల్లడి

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యాన్ని ప్రకటించింది. ఈ ఏడాదిలో సంస్థ ఉద్యోగులకు జనవరిలో ఇవ్వాల్సిన డీఏను (DA) అందజేస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శుక్రవారం సంస్థ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వై. నాగిరెడ్డి , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమార 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది.

**పెరిగిన డీఏ లెక్కలివే...**

ప్రస్తుతం ఆర్టీసీ ఉద్యోగులకు 50.7 శాతం డీఏ అందుతుండగా, తాజాగా 2.1 శాతాన్ని పెంచారు. ..మిగతా 2లో

## జ్యోతిరావు పూలే: భారత్ కు నేటికీ దారి చూపే ధృవతార!

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ



2

## జాతీయ స్థాయిలో కళా ప్రతిభను చాటిన తెలంగాణ ఉద్యోగులు అభినందించిన మంత్రి జూపల్లి

3



## "ప్రపంచం శాంతి చర్చల్లో... భారత్ మౌనంలో!"

- "విశ్వగురు మాటల్లోనేనా? నాయకత్వం ఎక్కడ?"
- డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్



2

## పేదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద రాజకీయం

వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం

3






## సంఘటన్ సృజన్ అభియాన్

2

పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకుడు హర్కారా వేణుగోపాల్ రావు

# ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ పెంపు



(మొదటి పేజీ తరువాయి)

దీనితో మొత్తం డీఏ 52.8 శాతానికి చేరింది. ఈ పెంపు జనవరి 1, 2026 నుండి అమల్లోకి వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. గత మూడు నెలలకు (జనవరి, ఫిబ్రవరి, మార్చి) సంబంధించిన బకాయిలను ఏప్రిల్ నెల జీతంతో పాటు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ పెంపు వల్ల సంస్థపై ప్రతి నెలా రూ. 2.82 కోట్ల మేర ఆర్థిక భారం పడనుంది.

**ఆర్టీసీ సిబ్బందికి డీఏలన్నీ చెల్లింపులు**

గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న డీఏలను ఈ ప్రభుత్వం వరుసగా విడుదల చేస్తూ వస్తోంది. 2024 మే నెలలో RPS 2017 అమలు చేసిన తర్వాత, తాజాగా ఈ 2.1 శాతం డీఏను కూడా మంజూరు చేయడంతో, ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలన్నీ పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. గత ఏడాది జూలై 2025లో కూడా ప్రభుత్వం 2.1 శాతం డీఏను పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**కార్మికుల సంక్షేమమే ధ్యేయం : మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రజా పాలన ప్రభుత్వం మొదటి నుండి ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డీఏ పెంపుతో పాటు అంతకుముందు పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాక త్రిసభ్య కమిటీ ద్వారా దీర్ఘకాలంగా విధులకు దూరమైన వారిని తిరిగి తీసుకోవడం, కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం ఆర్టీసీ ఆసుపత్రిని ఆధునీకరించడం జరిగిందన్నారు. సంస్థలో ఖాళీలను భర్తీ చేసేందుకు కూడా నియామకాల చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సంస్థ ఉద్యోగులకు డీఏను చెల్లించాలని మంత్రి ఆదేశించడం పట్ల టీజీఎస్‌ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ వై. నాగిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సిబ్బంది సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ఈ డీఏ పెంపు ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగలదని ఎండీ నాగిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈడీ లు శ్రీ. సిహెచ్.వెంకన్న, శ్రీ. ఖుస్రో షా ఖాన్,శ్రీ. రాజశేఖర్, శ్రీ.సాల్మన్, ఎఫ్ఏ శ్రీమతి విజయపుష్ప, సిటీఎం ఏం & సి శ్రీ .శ్రీధర్, సిపిఎం శ్రీమతి ఉషాదేవి, సీసీఈ శ్రీమతి కవిత తదితరులు పాల్గొన్నారు.



# "ప్రపంచం శాంతి చర్చల్లో... భారత్ మౌనంలో!"

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:**

ప్రపంచ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న ఈ కీలక సమయంలో, పాకిస్తాన్‌లో అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చలు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్రపంచ దేశాలు చురుకుగా ముందుకు వస్తున్న ఈ సమయంలో, భారత్ మాత్రం మౌనంగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. "విశ్వగురు" అనే పెద్ద నినాదంతో దేశాన్ని నడిపిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ఇలాంటి కీలక దౌత్య సందర్భాల్లో భారత్ పాత్ర లేకపోవడం దేశ ప్రతిష్టను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. నాయకత్వం అంటే కేవలం మాటలు కాదు... ప్రపంచం మారుతున్నప్పుడు ముందుండి మార్గనిర్దేశం చేయడం. దౌత్యం అంటే మౌనం కాదు... సమయంలో స్పందించి ప్రభావం చూపడం. చిన్న దేశాలు కూడా శాంతి చర్చల్లో మధ్యవర్తిత్వం చేస్తుంటే, భారత్ మాత్రం పక్కన కూర్చోవడం బాధాకరం. ఇది కేవలం ఒక దౌత్య లోపం కాదు—భారత్ గ్లోబల్ స్థాయిలో తన స్థానం కోల్పోతుందనే సంకేతం. భారత్‌కు శక్తి ఉంది... సామర్థ్యం ఉంది... కానీ ఆ సామర్థ్యాన్ని ఉపయోగించే దిశలో ప్రభుత్వ చురుకుదనం కనిపించడం లేదు. ప్రపంచ వేదికపై నాయకత్వం వహించాల్సిన భారత్, నేడు ప్రేక్షకుడిగా మారిపోవడం విచారకరం. దేశానికి మౌనం కాదు... దిశ చూపే నాయకత్వం అవసరం. భారత్‌కు పక్కసీటు కాదు... ప్రపంచ చర్చల టేబుల్‌పై ప్రధాన స్థానం కావాలి.

# సంఘటన్ సృజన్ అభియాన్

నాందేడ్, మహారాష్ట వెలుతురు ఏప్రిల్ 10:

సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం రెండో రోజు నాందేడ్ నగరంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏఐసీసీ పరిశీలకుడు శ్రీ హర్కారా వేణుగోపాల్ రావు గారు కార్యక్రమంలో పాల్గొని, పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమీక్షించారు. ఆయన పార్టీ నాయకులు మరియు బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశమై, పార్టీ బలపర్చడం మరియు సమన్వయాన్ని పెంపొందించడం పై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమం పార్టీ కార్యకర్తలలో ఐక్యత మరియు నిబద్ధతను ప్రతిబింబించింది. భవిష్యత్తు కార్యాచరణ, బూత్ స్థాయి నిర్వహణ, మరియు సంస్థ బలోపేతం పై చర్చలు జరిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, పార్టీ లక్ష్యాలను సాధించేందుకు నాయకులు మరియు కార్యకర్తలు మరింత కృషి చేయాలని సంకల్పించారు.




# జ్యోతిరావు పూలే: భారత్ కు నేటికీ దారి చూపే ధృవతార!

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 10:

ఏప్రిల్ 11 నేడు. మనందరికీ చాలా ప్రత్యేకమైన రోజు. భారతదేశపు అగ్రశ్రేణి సంఘ సంస్కర్తల్లో ఒకరు, తరతరాలకూ మార్గదర్శిగా నిలిచిన క్రాంతిపథగామి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నేడు. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభం నేపథ్యంలో, ఈ ఏడాది మరింత విశిష్టతను సంతరించుకున్నది.



మహాత్మాపూలే గొప్ప సంఘసంస్కర్త. అంతేకాదు.. నైతిక స్థైర్యం, నిరంతర సత్యాన్వేషణ, సామాజిక శ్రేయస్సు పట్ల అచంచలమైన అంకితభావం కలబోసిన ఉదాత్త జీవితం ఆయనది. ఎన్నో సంస్థలను నెలకొల్పి, ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించి చిరస్మరణీయులయ్యారు పూలే. ఆయన రేకెత్తించిన సరికొత్త ఆశలు, దేశజనుల్లో నింపిన ఆత్మవిశ్వాసం, మన నాగరికతా పరిణామ క్రమంలో ఆయన చేసిన అసమానమైన సేవలూ... నేటికీ లక్షలాది మందికి స్ఫూర్తిని అందిస్తున్నాయి.

పుణ్యభూమి మహారాష్ట్రలో 1827లో మహాత్మా పూలే జన్మించారు. అతిసామాన్య నేపథ్యం నుంచి ఎదిగారాయన. కానీ తొలినాటి కష్టాలేవీ ఆయన అభ్యాసానికీ, ధైర్యానికీ, సామాజిక నిబద్ధతకూ అడ్డుగోడలు కాలేకపోయాయి. సవాళ్లు ఏవైనా సరే నిశ్చేష్టులుగా ఉండిపోకుండా.. కష్టపడి జ్ఞానాన్ని ఆర్జించి, ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్న దృఢ సంకల్పమే ఆయనలో ఎన్నడూ తొణికిసలాడేది. చిన్నతనంలోనే, విద్యార్థి దశ నుంచే జ్యోతిరావు పూలేలో అపారమైన జిజ్ఞాస ఉండేది. నిరంతర అధ్యయన శీలి. తన వయసు పిల్లల స్థాయికి మించిన పుస్తకాలను చదివేవాడు. ''మనం ఎంత ప్రశ్నిస్తే అంత జ్ఞానాన్ని పొందుతాం'' అని తర్వాతి కాలంలో ఆయనే చెప్పారు. చిన్ననాటి నుంచే ఆయనకు అలవడిన ఆ సత్యాన్వేషణ దృక్పథం ఎక్కడా రాజీపడకుండా జీవితాంతమూ కొనసాగింది. విద్యనూ, జ్ఞాన సముపార్జననూ జీవిత లక్ష్యాలుగా మలచుకున్నారు మహాత్మాపూలే. జ్ఞానం కొందరి గుత్తాధిపత్యం కాదనీ, ఆ శక్తి అందరికీ అందాలనీ స్పష్టంగా గుర్తించారాయన. సమాజంలో అనేకులకు అక్షర జ్ఞానం అందని ద్రాక్షగా ఉన్న ఆ కాలంలోనే బాలికల కోసం, విద్యావకాశాలు లేని వర్గాల కోసం పాఠశాలలను తెరిచి విద్యా విప్లవానికి నాంది పలికారు. ''తల్లి ద్వారా బిడ్డకు అందే సంస్కారం అమూల్యమైనది. అందుకే, పాఠశాలలు తెరవాలనుకుంటే మొదట బాలికల కోసమే తెరవాలి'' అనేవారాయన. సామాజిక న్యాయాన్నీ, సమానత్వాన్నీ సాధించే శక్తిమంతమైన సాధనంగా తరగతి గదిని నిలిపి.. ఓ సరికొత్త సామాజిక దృక్పథాన్ని ఆవిష్కరించేందుకు ఆయన ఎంతగానో కృషిచేశారు. విద్య పట్ల ఆయన దార్శనికత మనందరికీ స్ఫూర్తిదాయకం. దేశ యువతలో పరిశోధన, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడం లక్ష్యంగా గత పదేళ్లుగా మేమెంతో కృషి చేశాం. ప్రశ్నించేలా, అన్వేషించేలా, నూతన ఆవిష్కరణలు చేసేలా యువతరాన్ని ప్రోత్సహించే పటిష్టమైన వ్యవస్థను నిర్మిస్తున్నాం. విజ్ఞానం, నైపుణ్యాలు, అవకాశాల్లో పెట్టుబడుల ద్వారా.. సమస్యల పరిష్కర్తలుగా, దేశ ప్రగతికి సారథులుగా భారత్ తన యువతను సశక్తులుగా తీర్చిదిద్దుతోంది. మహాత్మాపూలే తన విజ్ఞానంతో, వివేకంతో... వ్యవసాయం, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలపై విస్తృత అవగాహనను పెంపొందించుకున్నారు. రైతులు, కార్మికులకు అన్యాయం జరిగితే మన సమాజం బలహీనపడుతుందని ఆయనెప్పుడూ చెప్పేవారు. పొలాల నుంచి పలెల్ల దాకా.. రోజువారీ జీవితంలో సామాజిక అసమానతల తీవ్రతను ఆయన నిశితంగా గమనించారు. అందుకే పేదలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడడంలో ఆయన పూర్తిగా నిమగ్నమయ్యారు. అలాగే సామాజిక సామరస్యం కోసం శక్తివంచనలేకుండా నిర్విరామంగా కృషి చేశారు. ''జోపర్యంత సమాజాతీల సర్వానా సమాన అధికార మిళత్ నహీత్, తోపర్యంత ఖరే స్వతంత్ర్య మిళత్ నహీ (సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేంత వరకు నిజమైన స్వేచ్ఛను సాధించలేము)'' అన్నది మహాత్మాపూలే అభిప్రాయం. సమ సమాజం లక్ష్యంగా.. ఈ ఆశయాన్ని కార్యాచరణగా మలిచే దిశగా ఎన్నో సంస్థలను ఆయన నెలకొల్పారు. ఆయన స్థాపించిన సత్యశోధక సమాజం ఆధునిక భారతదేశంలో అత్యంత ముఖ్యమైన సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో ఒకటి. సామాజిక సంస్కరణ, సమాజ సేవ, మానవ గౌరవాన్ని పెంపొందించడంలో ఇది అగ్రగామిగా నిలిచింది. మహిళలు, యువత, గ్రామీణ ప్రజలకు గొంతుకైంది. న్యాయం, ప్రతి వ్యక్తికీ గౌరవం, సమష్టి పురోగతి స్ఫూర్తిని కేంద్రంగా నిలపడం ద్వారా.. సమాజాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దవచ్చన్న మహాత్మాపూలే విశ్వాసానికి ఈ ఉద్యమం నిదర్శనం. ఆయన వ్యక్తిగత జీవితమూ ధైర్యసాహసాలను బోధించే పాఠమే. నిరంతరం జనబాహుళ్యంలో ఉంటూ ప్రజల కోసం పరితపించడం ఆయన ఆరోగ్యంపై ప్రభావం చూపింది. అత్యంత క్లిష్టమైన అనారోగ్య సమస్యలు కూడా ఆయన సంకల్పాన్ని సడలించలేకపోయాయి. పక్షవాతం బారిన పడి శరీరం సహకరించని స్థితిలోనూ తన కృషిని కొనసాగించారు. అవును, ఆయన శరీరం కఠిన పరీక్షను ఎదుర్కొని ఉండవచ్చు.. కానీ సమాజం పట్ల ఆయన నిబద్ధత మాత్రం సడలలేదు. ఆయన జీవితంలోని ఈ అకుంఠిత దీక్షే.. నేడు ఎన్నో కష్టాలకోర్చి, పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్న లక్షలాది మందికి స్ఫూర్తినిస్తోంది. గౌరవ సావిత్రీబాయి పూలేను స్మరించుకోకుండా మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి అసంపూర్ణమే అవుతుంది. దేశం గర్వించదగ్గ అగ్రశ్రేణి సంస్కర్తల్లో ఆమె ముందువరుసలో నిలుస్తారు. దేశపు తొలితరం మహిళా ఉపాధ్యాయినిగా, బాలికా విద్యా వికాసంలో ఆమె నిర్ణయాత్మక పాత్ర పోషించారు. తద్వారా వారు కలలను సాకారం చేసుకునే అవకాశాన్నిచ్చారు. మహాత్మా పూలే మరణానంతరమూ.. ఆ ఆశయ దీప్తిని సావిత్రీబాయి ఆరనివ్వలేదు. 1897లో ప్లేగు వ్యాధి విరుచుకుపడిన తరుణంలో.. బాధితుల సేవలో ఆమె పునరంకితమయ్యారు. చివరకు అదే వ్యాధికి గురై ప్రాణాలు విడిచిన త్యాగమూర్తి ఆమె. మనది పుణ్యభూమి. విశిష్టమైన భావాలు, నిరుపమాన త్యాగాలు, అకుంఠిత దీక్షతో మన సమాజాన్ని శక్తిమంతంగా మలచిన మహనీయులు, వీరనారులకు నిలయమిది. మార్పు ఎక్కడినుంచో మొదలవుతుందని ఎదురుచూడలేదు. వారే మార్పునకు నాంది పలికారు. శతాబ్దాల నుంచి దేశంలో సామాజిక పురోగతి దిశగా.. మన సమాజం నుంచే శంఖారావం వినిపించింది. పీడితుల వ్యథను గుర్తించి.. దానిని 'తలరాత' అని సరిపెట్టుకోకుండా ఎదురుతిరిగిన వారి నుంచి ఆ చైతన్యం పుట్టుకొచ్చింది. అలాంటి యోధుల్లో ఒకరు మహాత్మా జ్యోతిరావు పూలే. 2022లో పూణే పర్యటన సందర్భంగా.. అక్కడి మహాత్మా పూలే భవ్య విగ్రహం వద్ద నివాళి అర్పించడం నాకెప్పటికీ గుర్తుంటుంది. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభ వేళ.. ఆయన ఆశయాల దిశగా పునరంకితం కావడమే మనం అర్పించే ఘనమైన నివాళి. ముఖ్యంగా ఆయనకెంతో ఇష్టమైన విద్య వంటి ఆదర్శాలకు మనం పునరంకితం కావాలి. అన్యాయంపై నిరసన తెలిపే సున్నితత్వాన్ని పెంచుకోవాలి. సమాజ స్వయం సంస్కరణ సామర్థ్యంపై మన విశ్వాసాన్ని బలంగా చాటాలి. నైతిక స్పష్టత, ప్రజా ప్రయోజనం రెండూ తోడైతే.. ఈ సమాజ శక్తి దేశంలో అద్భుతాలు సృష్టించగలదని ఆయన జీవితం నిరూపించింది. అందుకే నేటికీ లక్షలాది మందికి ఆయన ఆలోచనలు బలాన్నిస్తున్నాయి. ఆయన మాటలూ, చర్యలూ నేటికీ ఆశను చిగురింపజేస్తున్నాయి. ఆయన జన్మించి దాదాపు రెండు వందల ఏళ్లు గడుస్తున్నా మహాత్మా జ్యోతిరావు పూలే గత కాలపు శక్తిగానే కాకుండా.. నవ భారత భవితకు మార్గదర్శిగా విరాజిల్లుతున్నారు.

# కేసీఆర్ ఫోన్, పరుగులు పెట్టిన ఆఫీసర్లు

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ తన స్టైల్‌లో సమాధానమిచ్చారు. సిద్ధిపేట జిల్లా ములుగు మండలంలోని కొట్యాల, అల్లీనగర్, అడవి మజీద్, క్షీరసాగర్ వంటి గ్రామాల్లో వందలాది ఎకరాల పంట పొలాలు నీరు లేక కళ్లముందే ఎండిపోతున్నాయి. కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి, ఆలేరు కాలువలకు నీటిని వదులుతున్నా.. తమ గ్రామాల కాలువలకు మాత్రం నీరు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో, విసిగిపోయిన రైతులు డీసీసీబీ మాజీ డైరెక్టర్ అంజిరెడ్డిని ఆశ్రయించారు.

**సీన్ లోకి ఎంట్రీ ఇచ్చిన 'ఎర్రవల్లి' బాస్!**

రైతుల కష్టాన్ని విన్న అంజిరెడ్డి నేరుగా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న కేసీఆర్‌ను కలిశారు. ఎండిపోతున్న పంటల ఫోటోలను చూసిన కేసీఆర్, క్షణం కూడా ఆలస్యం చేయకుండా నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేశారు. "రైతు కంట కన్నీరు రాకూడదు.. పంటలు ఎండిపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? వెంటనే నీటిని విడుదల చేయండి" అంటూ తనదైన శైలిలో సూచించారు.

**హుటాహుటిన పరుగులు పెట్టిన యంత్రాంగం!**



ఆశ్చర్యకరంగా.. కేసీఆర్ ఫోన్ చేసిన కాసేపటికే అధికార యంత్రాంగంలో చలనం వచ్చింది. అప్పటివరకు సవాలక్ష కారణాలు చెప్పిన అధికారులు, మాజీ సీఎం ఆదేశాలతో వెంటనే అలర్ట్ అయ్యారు. హుటాహుటిన కొండపోచమ్మ సాగర్ నుంచి కాలువలకు నీటిని విడుదల చేశారు. కాలువల్లో నీరు ఉరకలెత్తుతుంటే రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది.

**సోషల్ మీడియాలో వైరల్:**

ఈ ఘటన ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అధికారంలో లేకపోయినా కేసీఆర్ ఒక ఫోన్ కాల్‌తో యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. "సీఎం సీటులో ఉన్నా లేకున్నా.. కేసీఆర్ క్రేజ్ వేరు" అంటూ ఆయన అభిమానులు పోస్టులు పెడుతున్నారు. ఫామ్ హౌస్ నుంచే పాలనను శాసించగల సత్తా ఆయనకు ఉందని ఈ ఘటనతో మరోసారి స్పష్టమైంది. తమ పంటలను కాపాడిన కేసీఆర్‌కు ఆయా గ్రామాల రైతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు: సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్లను రాజీవ్‌గాంధీ అమలు చేశారు. మహిళా బిల్లును సోనియాగాంధీ గతంలోనే పార్లమెంట్‌లో పెట్టారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ కూడా అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ఎందుకు లింక్ పెడుతున్నారు? ప్రస్తుతమున్న 543లో కూడా మహిళా రిజర్వేషన్ అమలు చేయొచ్చు. ప్రస్తుత సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలు చేస్తే ఎవరూ అడ్డుపడరు. ఉత్తరదక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరాన్ని పెంచాలని భాజపా చూస్తోంది. ఆర్థిక అంతరాలతో ఇప్పుడు రాజకీయ అంతరాలు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర, దక్షిణాది మధ్య నియోజకవర్గాల్లో అంతరం ఉంది. కొత్త అంతరం ప్రస్తుతం మోతాదులోనే ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఎన్డీయే చెబుతున్న లెక్కలు ఉత్తరదక్షిణాది మధ్య పెద్ద అంతరం పెంచనున్నాయి. ఐదు రాష్ట్రాలతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నది భాజపా ఆలోచన'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.



# జి హెచ్ ఎం సి లో అవినీతి జరుగుతోంది : కవిత

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:

ఓఆర్ఆర్ లో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్ట్‌ను సీఎం రేవంత్ కొనసాగిస్తున్నారు అవినీతి కోసమే ఫ్యూచర్ సిటీ అంటున్నారు. ఈనెల 25న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశాం. మహిళా బిల్లు అమలు కాకపోతే ఎన్నికల్లో మహిళలు నష్టపోయారు బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నా నిజామాబాద్ ఎంపీ అరవింద్‌కు అహంకారం ఎక్కువైంది ఎంపీ అరవింద్‌ను ప్రజలు ఎప్పుడో మర్చిపోయారు.. ఎవరో చెప్తే పార్టీ పెట్టేస్థాయిలో నేను లేనుకవిత కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు మరమ్మతులు టెండర్ల ప్రకారమే పనులు చేయాలికవిత





## రొబోటిక్ సర్జరీల్లో 'అపోలో' ప్రపంచ రికార్డు: డా.సంగీతా రెడ్డి

హైదరాబాద్, వెలుతురు, ఏప్రిల్ 10: గుండె శస్త్ర చికిత్సల్లో జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి ప్రపంచ రికార్డు సృష్టించిందని, 155 రోజుల్లో 100 రొబోటిక్ కార్డియాక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేసిందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా.సంగీతా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా.సంగీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య సేవలకు అపోలో కట్టుబడి ఉందన్నారు. దేశంలోనే తొలి సారిగా రోబోటిక్ సర్జరీలు ప్రారంభించిన ఆసుపత్రుల్లో అపోలో ముందు వరుసలో ఉందన్నారు. 'డా విన్సీ' వంటి అత్యాధునిక వ్యవస్థలతో శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని తెలిపారు. డా.నాగేశ్ నేతృత్వంలో 155 రోజుల్లో 100 గుండె ఆపరేషన్లు చేయడం అరుదైన ఘనత అని డా. సంగీతారెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో 5060శాతం గుండె శస్త్ర చికిత్సలు రొబోటిక్ విధానంలోనే జరిగే అవకాశం ఉందన్నారు. భారత వైద్యులు ప్రపంచ రోగులకు సేవలు అందించే స్థాయికి చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. 'అపోలో' సీనియర్ కన్సల్టెంట్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డా.నాగేశ్ మాట్లాడుతూ.. ఓపెన్ హార్ట్ సర్జరీలతో పోలిస్తే రొబోటిక్ శస్త్ర చికిత్సలతో అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి రీజినల్ సీఈఓ తేజస్వీరావు, సీఓఓ రామ్‌చందర్, మెడికల్ డైరెక్టర్ డా.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## అలుసుగా తీసుకోవద్దు.. కోర్టులతో ఆటలొద్దు!

హైదరాబాద్, వెలుతురు, ఏప్రిల్ 10: వివిధ ప్రభుత్వ శాఖల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్, జీపీఎఫ్, కమ్యుటేషన్, గ్రాట్యుటీ, ఆర్జిత, సరెండర్ సెలవులు, గ్రూప్ ఇన్సూరెన్స్ వంటి ప్రయోజనాలను ఏప్రిల్ 9లోగా చెల్లించాలన్న ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలుచేయకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. 737 మందికి చెల్లించామని ప్రభుత్వం చెబుతున్నా పరిష్కారమైన పిటిషన్లను చూస్తే 221 మాత్రమే ఉన్నాయంది. టోకెన్లు జారీ అయినప్పటికీ పూర్తిస్థాయిలో చెల్లింపులు జరగలేదంది. చివరిగా అవకాశం ఇస్తున్నామని ఈలోగా పాక్షిక చెల్లింపులు కాకుండా పూర్తిస్థాయిలో చెల్లించాల్సిందేనని స్పష్టంచేసింది. ఒక్కటి పెండింగ్ ఉన్నా గత ఉత్తర్వుల ప్రకారం వ్యక్తిగతంగా హాజరు కావాల్సిందేనని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియాకు స్పష్టంచేసింది. మరోసారి గడువు ఇస్తున్నామని అలుసుగా తీసుకోరాదని, కోర్టులతో ఆటలొద్దని హెచ్చరించింది.
రెగ్యులర్ ఉద్యోగులకు ఒకనెల జీతం ఆగినా పట్టించుకోమని, పదవీ విరమణ చేసినవారికి చెల్లించకపోతే అనుమతించే ప్రసక్తే లేదంది. అదేమీ ప్రభుత్వ సొమ్ము కాదని, వారి సొంత సొమ్మని.. పిల్లల చదువులు, వివాహాలు వంటి అవసరాలకు దాచుకున్న నిధి ఉపయోగపడటం లేదంది. విచారణను జూన్ 10కి వాయిదా వేస్తూ ఆరోజు ఒక్కో పిటిషనర్‌కు సొమ్ము చెల్లించినట్లు పిటిషన్‌వారీగా నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించాలంటూ గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై దాఖలైన సుమారు 572కిపైగా కోర్టు ధిక్కరణ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు గురువారం విచారణ చేపట్టారు. 3,656 టోకెన్లు జారీచేశామని, 1,056కి చెల్లింపులు జరిగాయని, మరో 2,600 టోకెన్లకు చెల్లించాల్సి ఉందని ఏప్రిల్ 9లోగా చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంపై న్యాయమూర్తి ప్రశ్నించారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ల తరపు న్యాయవాదులందరూ ఇక్కడ లేరని, కొంతమంది మాత్రమే ఉన్నారన్నారు. 758లో 737 మందికి చెల్లించామని తెలిపారు. దాదాపు 4వేల టోకెన్లను క్లియర్ చేశామన్నారు. ట్రెజరీ రికార్డుల నుంచి జాబితాను పరిశీలించాలన్నారు. న్యాయవాదులు వారి పిటిషనర్ల నుంచి వివరాలు తెలుసుకుని కోర్టుకు చెప్పాలన్నారు. పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ పూర్తిస్థాయిలో సొమ్ము చెల్లించలేదన్నారు. 737 మంది అంటున్నా ఒక్కో వ్యక్తికి 2 నుంచి 10 వరకు వివిధ హెడ్‌ల కింద టోకెన్లు జారీఅయ్యాయని, వీటిలో కొన్నింటికి చెల్లింపులు జరిపి మరికొన్నింటిని నిలిపివేశారన్నారు. కొందరికి 20% సొమ్ము మాత్రమే అందిందని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి చివరిగా మరో అవకాశం ఇస్తున్నామని జూన్ 10లోగా మొత్తం బకాయిలు చెల్లించి అమలు నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీచేశారు.

## శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక సమస్య

హైదరాబాద్, వెలుతురు, ఏప్రిల్ 10: శంషాబాద్ నుంచి కోల్‌కతా వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. టేకాఫ్ తీసుకునే సమయంలో పైలట్ ఇంజిన్‌లో సమస్యను గుర్తించాడు. విమానాన్ని తిరిగి పార్క్ చేసి ప్రయాణికులను కిందకు దింపారు. మధ్యాహ్నం 3.15 గంటల నుంచి శంషాబాద్‌లోనే ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




# దేశంలోని రాష్ట్రాలలో చిన్న వయసు, నిర్ణయాలలో పెద్ద మనసు చాటుతున్న ప్రజా ప్రభుత్వం

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10: భారతదేశంలో చిన్న వయస్సున్న తెలంగాణ రాష్ట్రం, పెద్ద రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచే విధంగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోందని వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఈ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నిలుస్తూ, ఇచ్చిన మాటకు కట్టుబడి వ్యవహరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉన్నప్పటికి, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి అధికారంలోకి వచ్చిన మొదటి పంటకాలంలోనే 2 లక్షల లోపు ఉన్న పంట రుణమాఫీని చేసి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నమని మంత్రి తెలిపారు. ఈ నిర్ణయం దేశంలోనే ఒక మైలురాయిగా నిలిచిందని, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారిందని పేర్కొన్నారు. ఇదే విషయం గత పార్లమెంట్ సమావేశాలలో దక్షిణాది రాష్ట్రాలలో తెలంగాణ రైతుల పంట రుణబాకీలు అతి తక్కువ అని కేంద్రం సమర్పించిన నివేదిక ద్వారా స్పష్టం అయిందని అన్నారు. దేశంలో ఎన్నో రాష్ట్రాలు ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికి ఇలాంటి సాహసమైన నిర్ణయాన్ని తీసుకోలేకపోయాయని, కానీ మా ప్రభుత్వం మాత్రం రైతుల సంక్షేమం కోసం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు అర్థరహితమైనవని, పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే అని మండిపడ్డారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా రైతులకు రుణమాఫీ చేశారో, రైతులకు ఇంకా గుర్తుందని.. ప్రభుత్వాన్ని మెచ్చుకోకపోయిన కూడా ఇప్పటికయినా విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2014వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రం మిగులు బడ్జెట్ తో ఉందని, అయినప్పటికి వారు ఇచ్చిన లక్ష వరకు రుణమాఫీని ఒకేసారి చేయలేక పోయారని అన్నారు. దాంతో రైతులకు రుణమాఫీ కాకపోగా.. 2630 కోట్ల వడ్డీ భారం పడిందన్నారు. అయినప్పటికి రైతులు నమ్మి రెండో సారి కూడా అధికారం అప్పజెప్తే.. 2018 - 23 వరకు అధికారంలో ఉండి మరోసారి రుణమాఫీపై రైతులను మోసం చేశారని విమర్శించారు. 2018లో లక్ష వరకు పంట రుణమాఫీ చేస్తామని చెప్పి, దానిని దశలవారీగా అమలు చేయడం ద్వారా 8515 కోట్ల వడ్డీభారం పడటంతో పాటు, 8379 కోట్లు పూర్తిగా ఎగ్గొట్టారని ఆరోపించారు. అంతేకాక 1419 కోట్ల రూపాయలు ఖాతాలు సరిగ్గా లేనందున వెనక్కి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. ఈ విధంగా అధికారంలో ఉన్న పదేళ్ల పాటు రైతులను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం ఇప్పుడు రైతులపై ప్రేమ చూపించడం కపటత్వానికి నిదర్శమని అన్నారు. అయినప్పటికి మా ప్రభుత్వ అధికారంలోకి రాగానే రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకున్న, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి సాహసోపేతమైన నిర్ణయంతో, రైతులకు ఎలాగైనా ఒకేసారి పంట రుణమాఫీ చేయాలనే కృతనిశ్చయంతో 20,616.89 కోట్ల పంట రుణమాఫీని చేశామని, దాంతో 25,35,964 మంది రైతులు లబ్ధిపొందారని మంత్రి తుమ్మల అన్నారు. రుణమాఫీ అమలులో పారదర్శకత కోసం ముందుగా బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించి, 2 లక్షల లోపు ఉన్న రైతుల ఖాతాల వివరాలను సేకరించామని చెప్పారు. బ్యాంకులు అందించిన 25,35,964 మంది రైతుల డేటా ఆధారంగా రుణమాఫీని అమలు చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వంలా ఒడ్డు చేరే వరకు ఓడ మల్లన్న, ఒడ్డు చేరాక బోడి మల్లన్న అన్న చంధంగా... నిర్లక్ష్యంగా కాకుండా, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. కొన్ని ఖాతాల్లో లోపాలు ఉన్నప్పటికీ, వాటిని సరిచేయడానికి అధికారులు గ్రామాల వారీగా, ఇంటింటికి వెళ్లి ఆధార్ లింక్ చేసి, అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ ప్రయోజనం అందేలా కృషి చేశారని తెలిపారు. ఇది మా ప్రభుత్వానికి ఉన్న కట్టుబాటును, నిబద్ధతను స్పష్టంగా చూపిస్తోందన్నారు.
ప్రస్తుతం బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప మరే పనీ చేయడం లేదని, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు నిజంగా మేలు జరుగుతుంటే దాన్ని ఓర్వలేకే విమర్శలు చేస్తున్నారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని వారు, ఇప్పుడు రైతుల పక్షాన మాట్లాడటం చూస్తుంటే అది కపట ప్రేమకు పరాకాష్టగా కనిపిస్తోందని మంత్రి తుమ్మల విమర్శించారు. రైతులు ఈ విషయాలన్నింటి బాగా గమనిస్తున్నారని, వాస్తవాస్తవాలు వారికి తెలుసన్నారు.
రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయమని, భవిష్యత్తులో కూడా రైతులకు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.



## పేదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద రాజకీయం

- **వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం**
- **రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



ఖమ్మం వెలుతురు ఏప్రిల్ 10: ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని ఎవరు ఎన్ని కారుకూతలు కూసిన భవిష్యత్తు లో ఇందిరమ్మ ప్రభుత్వం ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో 1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 58.58 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలిన ఈ ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ధాన్యం కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ. 20,670 కోట్ల మేర రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని ఏడాదికి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త గా 3.80 లక్షల మందికి పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. ధరణి తో రైతులు ఇబ్బందులు పడ్డారని దాన్ని బంగాళాఖాతంలో వేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం వెంకటాపురంలో దేపంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో కళా ప్రతిభను చాటిన తెలంగాణ ఉద్యోగులు అభినందించిన మంత్రి జూపల్లి

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటిన తెలంగాణ ఉద్యోగ కళాకారులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. కేంద్ర సివిల్ సర్వీసెస్ సాంస్కృతిక బోర్డు (CCSCSB) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పతకాలు సాధించిన ఉద్యోగుల బృందం, శుక్రవారం రవీంద్రభారతిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కళాకారుల ప్రతిభను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తూనే, కళల పట్ల మక్కువతో జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఉద్యోగ కళాకారులకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి సహకారం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయీస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 47 మంది ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 16 రకాల కళారూపాల్లో తమ ప్రతిభను ప్రదర్శించి దేశవ్యాప్త ప్రశంసలు అందుకున్నారు. * వెస్ట్రన్ డ్యాన్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన గంధం సంతోష్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. * వీణ వాయిద్యంలో తృతీయ బహుమతి గెలుచుకున్న డాక్టర్ కె. పృథును, నాటిక (షార్ట్ ప్లే) విభాగంలో ఉత్తమ నటిగా ఎంపికైన ఇంద్రను మంత్రి సత్కరించారు. తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయీస్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి యామిని కనకతార నేతృత్వం వహించగా బృందం మేనేజర్ శ్రీశైలం సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగ సెక్రటేరియట్ అసోసియేషన్ ప్రతినిధులు, విజేతలు పాల్గొన్నారు



## "అన్నా.. నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని.."

**(మొదటి పేజీ తరువాయి)**
జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, జగిత్యాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు వసంత సురేశ్, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులున్నారు. నిరంతరం తన నియోజకవర్గం, జిల్లా ప్రజలు, రైతుల గురించి ఆలోచన చేసే రైతు నాయకుడు, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి. తెలంగాణ సాధకుడు రైతు బాంధవుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారి కలయిక సందర్భంగా భావోద్వేగ వాతావరణం నెలకొంది. కేసీఆర్ గారిని కలిసిన సందర్భంగా జీవన్ రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. "తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు.. అన్నా. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాల్లకైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా వుంది అన్నా.." అంటూ తన మనసులోని మాటను భావోద్వేగంతో మాజీ మంత్రి జీవన్ రెడ్డి వ్యక్తం చేశారు. కాగా...జీవన్ రెడ్డి గారిని అనునయిస్తూ, వారిని అప్యాయంగా దగ్గరికి తీసుకున్న కేసీఆర్ గారు, వారిని హృదయపూర్వకంగా ఆలింగనం చేసుకొని, శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. కాసేపు ఇష్టాగోష్టి తర్వాత జీవన్ రెడ్డి బృందాన్ని లంచ్ ఆతిథ్యానికి కేసీఆర్ ఆహ్వానించారు.



# రణం ఆగిందా? వ్యూహం మారిందా?



ప్రపంచ రాజకీయ యవనికపై అప్పుడప్పుడు కొన్ని క్షణాలు అగ్నిగోళంలా ఉద్భవిస్తాయి. అవి నిశ్శబ్దంగా అడుగుపెట్టి, కాలగర్భంలో యుగాలుగా ప్రతిధ్వనించే పెనుమార్పులకు నాంది పలుకుతాయి. సరిగ్గా అటువంటి ఒక చారిత్రాత్మక, ఉత్కంఠభరిత ఘట్టం ఇప్పుడు మన కళ్ళముందే ఆవిష్కృతమవుతోంది. ఇరవై ఐదు ఏళ్ళ సుదీర్ఘ విద్వేషం, నలభై రోజుల భీకర రక్తపాతం, వేలమంది ప్రాణత్యాగాల తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు ఇరాన్ మధ్య తుపాకీ గొట్టాలు ప్రస్తుతానికి మూగబోయాయి. తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటన వెలువడింది. కానీ, ప్రపంచ మేధావులను తొలిచేస్తున్న అసలు ప్రశ్న ఒక్కటే .ఈ విరమణ నిజంగా శాంతి వెలుగును మోసుకొచ్చిందా? లేక ఇది మరింత భయంకరమైన సునామీకి ముందు సముద్రం ప్రదర్శిస్తున్న భీతి గొలిపే నిశ్శబ్దమా? అగ్రరాజ్యం వేసిన ఎత్తుగడలు, ఇరాన్ ప్రదర్శించిన తెగింపుల వెనుక ఉన్న నిగూఢ సత్యాలను నిర్భయంగా విశ్లేషించాల్సిన సమయం ఆసన్నమైంది.చరిత్ర పుటల్లో 2026 ఫిబ్రవరి 28 ఒక చీకటి రోజుగా మిగిలిపోతుంది. ఆ రోజున అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాలు సంయుక్తంగా ఇరాన్‌పై విరుచుకుపడ్డాయి. అమెరికా దీనికి పెట్టిన పేరు ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ (Operation Epic Fury). పేరుకు తగ్గట్టుగానే ఇది ఒక భీకర యుద్ధానికి తెరలేపింది. ఈ దాడుల వెనుక ఉన్న ఏకైక లక్ష్యం స్పష్టం ఇరాన్ యొక్క అణ్వాయుధ కలలను శాశ్వతంగా సమాధి చేయడం.యుద్ధం ప్రారంభమైన తొలి రోజే ప్రపంచాన్ని నివ్వెరపరిచే వార్త వెలువడింది. అమెరికా క్షిపణి దాడుల్లో ఇరాన్ సర్వోన్నత నేత అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. ఆయనతో పాటు ఇరాన్ సైనిక యంత్రాంగంలోని దిగ్గజాలు, కీలక అధికారులు మట్టిలో కలిశారు. కానీ ఇరాన్ అంత తేలికగా తలవంచలేదు. నివేదికల ప్రకారం, ఈ 40 రోజుల్లో ఇరాన్ తన అమ్ములపొదిలోని శక్తిని మొత్తం బయటకు తీసింది. దాదాపు 5,000 డ్రోన్లు, 2,100 బాలిస్టిక్ క్షిపణులు, మరియు 50 కి పైగా క్రూజ్ క్షిపణులను ప్రయోగించి అమెరికా స్థావరాలపై నిప్పుల వర్షం కురిపించింది.అయితే, అమెరికా సాంకేతిక ఆధిపత్యం ముందు ఇరాన్ అణు కేంద్రాలు కనుమరుగయ్యాయి. ఇస్ఫహాన్ లాంటి అత్యంత సురక్షిత ప్రాంతాల్లో భూమిలో పాతిపెట్టిన 60% సాంద్రత గల యురేనియం నిల్వలు ఇప్పుడు అమెరికా ఉపగ్రహాల కనుసన్నల్లో ఉన్నాయి. గాలిలో మందుగుండు వాసన, నేలపై రక్తపు మరకలు ఇరాన్ ఒక శ్మశానవాటికను తలపిస్తున్న వేళ ఈ విరమణ ప్రకటన వచ్చింది.

డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో ట్రూత్ సోషల్ వేదికగా, రెండు వారాల పాటు బాంబు దాడులను నిలిపివేస్తున్నాం.ఇది ఇరువైపుల విజయం! అంటూ ప్రకటించారు. ఇరాన్ కూడా దీనికి తలూపింది. పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం వెనుక ప్రధానంగా హోర్ముజ్ జలసంధి వ్యాపార ప్రయోజనాలు ఉన్నాయి. కానీ ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఇరాన్ ఒక 10 అంశాల ప్రణాళిక ను అమెరికా అంగీకరించిందని ప్రచారం చేస్తోంది. ఇందులో ఆంక్షల రద్దు, యురేనియంపై హక్కులు వంటి భారీ డిమాండ్లు ఉన్నాయి. అయితే, ట్రంప్ యంత్రాంగం వీటిని ససేమిరా కొట్టిపారేసింది. విరమణ ప్రకటించిన గంటల్లోనే కువైట్, యూఏఈలపై మళ్ళీ దాడులు జరగడం చూస్తుంటే, ఈ ఒప్పందం ఒక పేక మేడలా కనిపిస్తోంది. ఇది శాంతి ఒప్పందమా లేక తదుపరి దాడులకు వ్యూహాలు రచించుకోవడానికి తీసుకున్న టీ బ్రేక్ ఆ అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ యుద్ధంలో విజేతను నిర్ణయించడం అంత సులభం కాదు. ఇది ఒక సంక్లిష్టమైన చదరంగం.అమెరికా కోణం సైనిక పరంగా ట్రంప్ విజయం సాధించారు. ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడం, ఖమేనీని అంతమొందించడం, హోర్ముజ్ జలసంధిని తెరిపించడం వంటి లక్ష్యాలను అమెరికా చేరుకుంది. ట్రంప్ దృష్టిలో ఇది ప్రపంచ శాంతికి గొప్ప రోజు .ఇరాన్ కోణం ఇరాన్ దీనిని అమెరికాపై సాధించిన ఘోర పరాజయం గా అభివర్ణిస్తోంది. 40 రోజుల పాటు ప్రపంచ అగ్రరాజ్యాన్ని ఎదురించి నిలబడటం, చర్చల పట్టిక వద్ద అమెరికాతో సమానంగా కూర్చోవడం ఇరాన్ తన నైతిక విజయంగా భావిస్తోంది. ఖమేనీ స్థానంలో వచ్చిన ఆయన కుమారుడు మొజ్తబా, తండ్రి కంటే కఠినమైన వైఖరి గలవాడు కావడం ఇరాన్ భవిష్యత్తు వైఖరిని సూచిస్తోంది. నిజానికి, యుద్ధభూమిలో అమెరికా గెలిచినా, రాజకీయంగా ఇరాన్ తన ఉనికిని చాటుకుంది. ఒక రకంగా చెప్పాలంటే, ఇది అందరూ ఓడిపోయిన యుద్ధం.ఈ మలుపులో చైనా, పాకిస్తాన్, సౌదీ అరేబియా, టర్కీ వంటి దేశాల పాత్ర కీలకంగా మారింది. ఒకప్పుడు అమెరికా ఒంటరిగా నిర్ణయాలు తీసుకునేది, కానీ ఇప్పుడు బహుళ ధ్రువ ప్రపంచం (Multipolar world) ఆవిర్భవించింది. పాకిస్తాన్ ప్రధాని షెహ్బాజ్ షరీఫ్ చొరవతో ఇస్లామాబాద్‌లో జరగనున్న చర్చలు రేపటి ప్రపంచ గమనాన్ని నిర్దేశించబోతున్నాయి.ముందున్నది ముళ్ళబాట అని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. భవిష్యత్తులో మూడు పరిణామాలు జరగవచ్చు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని వదులుకోవడం, అమెరికా ఆంక్షలు ఎత్తేయడం ద్వారా ఒక నూతన శకం మొదలవ్వడం. (ఇది ఆశావాదం). ఒప్పందాలు కుదరకపోయినా, పెద్ద యుద్ధం జరగకుండా ఆర్థిక పోరాటాలు కొనసాగడం.ఏప్రిల్ 22 తర్వాత చర్చలు విఫలమైతే, అమెరికా మళ్ళీ యుద్ధ విమానాలను గాల్లోకి లేపడం.ప్రస్తుతానికి నూనె ధరలు తగ్గి, మార్కెట్లు కోలుకున్నాయి. ప్రపంచం ఊపిరి పీల్చుకుంది. కానీ ఈ ఊపిరి తాత్కాలికమేనా? ఈ ఇరాన్‌అమెరికా ఘర్షణ మనకు నేర్పిన పాఠం ఒక్కటే బాంబులు భౌగోళిక సరిహద్దులను మార్చగలవు కానీ, హృదయాలలోని విద్వేషాన్ని చెరిపివేయలేవు. అమెరికా తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది, ఇరాన్ తన గాయాలను చూపిస్తూనే పంతం నెగ్గించుకోవాలని చూస్తోంది. హోర్ముజ్ జలసంధి తెరుచుకుంది కానీ, ఇరు దేశాల మధ్య నమ్మకపు తలుపులు గట్టిగా మూసుకుపోయాయి.ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరిగే చర్చలు కేవలం రెండు దేశాల భవితవ్యాన్ని మాత్రమే కాదు, మూడవ ప్రపంచ యుద్ధం వైపు వెళ్తున్న మానవాళి గమనాన్ని కూడా నిర్ణయిస్తాయి. ఇది సింహపు విజయమా లేక గాయపడిన పులి తాత్కాలికంగా వెనక్కి తగ్గడమా అనేది కాలమే సమాధానం చెప్పాలి. లోకం ఇప్పుడు ఇస్లామాబాద్ వైపు ఆశగా, ఆందోళనగా చూస్తోంది.



డా .సూర్యదేవర రామకృష్ణ , 9490754169

## అణువిద్యుత్ అక్షయపాత్ర దిశగా నవభారతం..!!




భారతదేశ అణు శాస్త్ర సాంకేతిక రంగంలో ఏప్రిల్ 6, 2026 సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అద్భుతమైన రోజు. ఇరాన్ లో జరుగుతున్న యుద్ధంలో అమెరికా, ఇరాన్ వద్ద ఉన్న అణు ఇంధనాన్ని తీసుకొస్తుందా లేక అణుబాంబు వేస్తుందా అన్న ఉత్కంఠతతో ప్రపంచం చూస్తున్న తరుణంలో భారత దేశంలో అణురంగంలో ఒక అద్భుతాన్ని ఆవిష్కరించింది. రష్యా తర్వాత ప్రపంచంలో మరి ఏ దేశము సాధించలేక, పలుమార్లు ప్రయత్నించి చతికలబడిపోయిన పరిస్థితిలో భారతదేశం పట్టు వదలకుండా సాధించిన ఘన కీర్తి చూసి ప్రపంచం అవాక్ అవుతున్న క్షణం. అదే ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (PFBR) క్రిటికలిటీ సాధించటం అదీ స్వదేశీ పరిజ్ఞానంతో. ఈ నూతన పరిజ్ఞానంతో బొగ్గు విద్యుత్, జలవిద్యుత్, సౌరవిద్యుత్ వంటి వాటిపై ఆధారపడకుండా శతాబ్దాల పాటు భారతదేశం నిరంతర అణువిద్యుత్ పొందే అవకాశానికి గట్టి పునాదులు పడ్డాయి. ఇది దశాబ్దాల మన అణు శాస్త్రవేత్తల కృషి ఫలితం మరియు గడిచిన 12 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు అందిస్తున్న సహకారంతో స్వయం సమృద్ధి భారతం అణు విద్యుత్ అక్షయ పాత్రకు పడిన బలమైన అడుగు.

సంప్రదాయంగా మనకి విద్యుత్ బొగ్గును మండించడం ద్వారా వస్తుంది దీనివల్ల ప్రమాదం పర్యావరణ కాలుష్యం బొగ్గు నిల్వలు అడుగంటిపోయే ప్రమాదం. జులై విద్యుత్ వల్ల పెద్ద డ్యాములు నిర్మాణం చేయాలి దానివల్ల పర్యావరణం నష్టపోతుంది. సౌర విద్యుత్ పవన విద్యుత్ ఉన్నప్పటికీ వాటిపైన పూర్తిగా ఆధారపడలేము. ఇక మిగిలింది అణు విద్యుత్. ఇది పర్యావరణానికి నష్టం కలిగించకుండా తక్కువ ప్రదేశంలోనే అత్యధిక విద్యుత్ని తయారు చేసే సమర్థత కలిగి ఉండటం. అయితే దీనికి కావలసిన ముడి పదార్థం యురేనియం. ఈ నిల్వలు మన దేశంలో అతి స్వల్పం. యురేనియం ఆధారిత అను రియాక్టర్లు మనదేశంలో 22 ఉన్నప్పటికీ ఈ ఇంధనాన్ని మనం అమెరికా, కెనడా, కజకిస్తాన్, రష్యా, ఆస్ట్రేలియా వంటి అనేక దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడే ప్రమాదం పొంచి ఉంది ఆయా దేశాలు మనకి ఎగుమతులు ఆపేస్తే మన అణు విద్యుత్ రియాక్టర్లు మూతపడతాయి, స్వయం సమృద్ధి భారతం లక్ష్యాలను మనం చేరుకోలేము. ఈ పరిస్థితిని అధిగమించటానికి 1950 దశకంలోనే భారత అణు పితామహుడు హోమీబాబా గారు ప్రతిపాదించిన మూడు దశల అణు విద్యుత్ కార్యక్రమం.

**మొదటి దశ:**

అణు రియాక్టర్ లో యురేనియం 238 ని ఇంధనంగా ఇచ్చి నియంత్రిత అణు విచ్ఛిత్తి గొలుసు చర్యలు చేయించి తద్వారా ఉత్పత్తి అయ్యే వేడిని ఉపయోగిస్తూ విద్యుత్తు ని తయారుచేస్తారు. ఈ ప్రక్రియలో వ్యర్థాలుగా ప్లూటోనియం బయటికి వస్తుంది. ఇది ఎప్పుడో చేరుకున్నాం దీని ఆధారంగానే దేశంలో 22 అణు విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి.

**రెండవ దశ:**

ఈ దశలో మొదటి దశలో వచ్చిన వ్యర్థం ప్రోటోనియం ని ఇంధనంగా వాడి యురేనియం 238 ని కలిపి నియంత్రిత అణు విచ్ఛిత్తి గొలుసు చర్య జరుపుతారు. ఈ చర్య ద్వారా విద్యుత్తు ఉత్పత్తి జరగటంతో పాటు వ్యర్థాలుగా ప్లూటోనియం మరియు యురేనియం 233 వస్తుంది. విచిత్రం ఏంటంటే ఈ దశలో ఇంధనంగా వాడిన ప్లూటోనియం కన్నా వ్యర్థంగా వచ్చే ప్లూటోనియం అధికం. అంటే మన కారులో ఇంధనంగా 50 లీటర్లు డీజిల్ వాడితే వ్యర్థంగా పొగ కాకుండా 70 లీటర్ల డీజిల్ వస్తే ఎలా ఉంటుందో ఆ పరిస్థితి. అధికంగా వస్తున్న ప్లుటోనియం ని మళ్లీ ఇంధనంగా రెండో దశలో వాడుతారు, ఇది నిరంతరంగా జరుగుతూ ఉంటుంది అందుకే దీన్ని క్రిటికాలిటీకి చేరుకోవటం అని అణు శాస్త్రజ్ఞుల భాషలో అంటారు. ఏప్రిల్ 6, 2026న కల్పకం, అణు విద్యుత్ కేంద్రంలో మనం చేరుకున్నది ఈ దశకి. ఇక తరువాయి మిగిలి ఉంది మూడోదశ.

**మూడో దశ**

రెండవ దశలో వ్యర్థంగా వచ్చిన యురేనియం 233ని థోరియం తో కలిపి అణు విచిత్తు చేయిస్తారు. దీనివల్ల అపారమైన విద్యుత్తు దీనితో పాటు వ్యర్థంగా యురేనియం 233 వస్తుంది. వ్యర్థంగా వచ్చిన ఈ యురేనియం 233ని మళ్లీ ఇంధనంగా మూడో దశలోనే థోరియంతో కలిపి వాడతారు. ఈ ప్రక్రియ నిరంతరంగా సాగుతుంది విద్యుత్తు ఉత్పత్తి నిరంతరంగా సాగుతూనే ఉంటుంది.

మనందరికీ ఆనందించగలిగిన విషయం ఏమిటంటే మన దేశంలో యురేనియం 238 నిల్వలు అతి స్వల్పం దిగుబడి మీద ఆధారపడుతున్నాం కానీ మన దేశంలో థోరియం నిల్వలు అపారం ప్రపంచంలో 25% థోరియం మనదేశంలో ఉంది అదికూడా ఆంధ్రప్రదేశ్లోని విశాఖ కాకినాడ సముద్ర తీరాలలో అత్యధికం. ఇది కాక కేరళం, ఒడిస్సా రాష్ట్రాల సముద్ర తీరాలలో కూడా అత్యధికంగా ఉంది. అంటే మూడోదశ "థోరియం రియాక్టర్" మన శాస్త్రవేత్తలు ఆవిష్కరించగలిగితే భారతదేశానికి అణు విద్యుత్తుకి కొదవే ఉండదు. ఈ దిశగా మన శాస్త్రవేత్తలు ఇప్పటికీ పని ప్రారంభించారు బహుశా ఒక దశాబ్ద కాలంలో "థోరియం రియాక్టర్" నీ ఆవిష్కరించే అవకాశాలు ఉన్నాయి. ఈ మూడో దశని మన శాస్త్రవేత్తలు ఎంత వేగంగా సాధించగలిగితే అంత వేగంగా భారతదేశం అణు విద్యుత్తులో అక్షయపాత్రని పొందుతుంది. ఇక శతాబ్దాల పాటు భారతదేశ వెనక్కి తిరిగి చూడక్కర్లేదు. స్వయం సమృద్ధ విద్యుత్తుతో భారత్ అభివృద్ధిని ఎవరు అడ్డుకోలేరు వికసిత భారత్ లక్ష్యాలని చేరుకోగలం, అణు విద్యుత్ అక్షయపాత్ర ని చేరుకోగలం. మన అణు శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారికి మద్దతుగా 140 కోట్ల ప్రజలు నిలబడదాం... జైహింద్..!!!



పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్

## సామాజిక చైతన్యానికి ఆయుధాలు పూలే ఆలోచనలు



సమాజంలో సమానత్వం, విద్య మరియు సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు జ్యోతిరావు పూలే. ఆయన ఆలోచనలు కేవలం 19వ శతాబ్దానికి మాత్రమే పరిమితం కావు; ఇవి నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. దేశంలో అణచివేతకు గురవుతున్న మహిళలోకానికి అక్షర లోకాన్ని చూపించి మహిళా జ్యోతులుగా తీర్చిదిద్దిన మహోన్నతమైన వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే.

పూలే గారి అభిప్రాయం ప్రకారం, భూమిలోని శూద్రులు, అతిశూద్రులు, గిరిజనులు, జాలర్లు వంటి అణగారిన వర్గాల ప్రజలు నిజంగా విద్యావంతులై, స్వతంత్రంగా ఆలోచించగలిగే స్థితికి చేరి, ఐక్యంగా నిలబడినప్పుడే నిజమైన “జాతి” ఏర్పడుతుంది. ఒక చిన్న వర్గం మాత్రమే దేశాన్ని ప్రతినిధ్యం చేస్తే అది నిజమైన జాతీయత కాదని ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రజలను నిజంగా ఏకం చేయాలంటే సమాజంలో ఉన్న క్రూరమైన కులవివక్ష భావజాలాన్ని తొలగించాల్సిందే అని ఆయన భావించారు. విజేతలుగా భావించబడిన వర్గాలు మరియు అణగారిన వర్గాల మధ్య ఉన్న అసమానతలను తొలగించి నిజమైన ఐక్యత సాధించినప్పుడే దేశం ముందుకు సాగుతుందని పూలే గారు చెప్పారు. పూలే గారి ఆలోచనల్లో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఉంది. “ఒక పురుషునికి విద్య నేర్పితే ఒక వ్యక్తికి నేర్పినట్లే; కానీ ఒక స్త్రీకి విద్య నేర్పితే ఒక కుటుంబం మొత్తానికి నేర్పినట్లే” అనే ఆయన మాటలు మహిళా విద్య యొక్క ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేశాయి.

ఆ సమయంలో భారత సమాజంలో కుల వివక్ష, అజ్ఞానం, మహిళలపై అన్యాయం విస్తృతంగా ఉండేవి. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా పూలే గారు ధైర్యంగా పోరాడారు. కుల వివక్ష పైనే కాదు మహిళల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి జ్యోతిరావు పూలే, ముఖ్యంగా మహిళల విద్య కోసం ఆయన చేసిన సేవలు అపారమైనవి. ఆయన తన జీవిత సహచరి సావిత్రిబాయి పూలేతో కలిసి భారతదేశంలో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా విద్యకు నాంది పలికారు. సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పడానికి ఆయన స్థాపించిన సత్యశోధక్ సమాజ్ సంస్థ కీలక పాత్ర పోషించింది. ఈ సంస్థ ద్వారా కులవ్యవస్థకు వ్యతిరేకంగా చైతన్యం కల్పించడం, అణగారిన వర్గాల ప్రజలకు హక్కులు కల్పించడం, వివాహాల్లో అనవసర ఖర్చులను తగ్గించడం వంటి అనేక సంస్కరణలు చేపట్టారు.

పూలే గారు రచయితగా కూడా సమాజంపై గొప్ప ప్రభావాన్ని చూపించారు. ఆయన రచనలు కేవలం పుస్తకాలుగా మాత్రమే కాకుండా సామాజిక చైతన్యానికి ఆయుధాలుగా నిలిచాయి.

పూలే గారు రైతుల సమస్యల పట్ల కూడా ఎంతో సున్నితంగా స్పందించారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని వారికి న్యాయం చేయాలని ఆయన నిరంతరం పోరాడారు. నేటి వ్యవసాయ సమస్యలను పరిశీలిస్తే ఆయన ఆలోచనలు మరింత ప్రాసంగికంగా కనిపిస్తాయి.

జ్యోతిరావు పూలే గారి ప్రముఖ రచనలు తృతీయ రత్న (1855) - కులవ్యవస్థ మరియు సామాజిక సమస్యలను విమర్శించే నాటకం.

- బ్రహ్మానాంచే కసబ్ (1869) - బ్రాహ్మణాధికృతపై విమర్శలు చేసిన రచన.
- గులాంగిరి (1873) - కులవ్యవస్థలోని అన్యాయాలను తీవ్రంగా విమర్శించిన ప్రముఖ గ్రంథం.
- షెట్కార్యాచా అసుద్ (1881) - రైతుల దుస్థితిని వివరించి, భూస్వాముల దోపిడీని విమర్శించిన రచన.
- సర్వజనిక్ సత్య ధర్మ (1891) - సమానత్వం, మానవత్వం మరియు నిజమైన ధర్మంపై ఆయన ఆలోచనలను వివరించిన రచన.

**జ్యోతిరావు పూలే గారి జీవితంలోని ముఖ్యమైన తేదీలు**

- 11 ఏప్రిల్ 1827 - మహారాష్ట్రలోని పూణేలో జననం.
- 1848 - భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి భారతదేశంలో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించారు.
- 1873 - సత్యశోధక సమాజ్ స్థాపన మరియు గులాంగిరి గ్రంథం ప్రచురణ.
- 1888 - ప్రజలు ఆయనకు “మహాత్మా” అనే బిరుదు ప్రదానం చేశారు.
- 28 నవంబర్ 1890 - ఆయన మరణం.

నేటి కాలంలో కూడా సమాజంలో సమానత్వం, విద్య, సామాజిక న్యాయం వంటి అంశాలు అత్యంత ముఖ్యమైనవి. సాంకేతికంగా మనం ఎంత అభివృద్ధి చెందినా, ఇంకా కొన్ని ప్రాంతాల్లో కుల వివక్ష, లింగ అసమానతలు కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పూలే గారి ఆలోచనలు మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి. విద్యలో సమాన అవకాశాలు కల్పించడం, మహిళల సాధికారతను పెంపొందించడం, కుల-మత వివక్షలను పూర్తిగా తొలగించడం, పేదరిక నిర్మూలన కోసం కృషి చేయడం—ఇవి అన్నీ పూలే గారి సిద్ధాంతాలే. ఇవే మన సమాజానికి అవసరమైన మార్గదర్శకాలు.

మొత్తానికి, జ్యోతిరావు పూలే గారి జీవితం సమాజానికి స్ఫూర్తి. ఆయన చూపిన సమానత్వం, విద్య, న్యాయం మార్గంలో నడిచినప్పుడే సమాజం నిజమైన అభివృద్ధిని సాధిస్తుంది. సబ్బండ కులాల అభ్యున్నతికి, సమానత్వం, సామాజిక న్యాయం కోసం వారు చేసిన కృషి త్యాగాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే మనం ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది.



వ్యాసకర్త
డాక్టర్ కేతూరి వెంకటేష్
టీపీసీసీ ఓబీసీ కన్వీనర్

## అరుట్ల గ్రామంలో ఇబ్రహీంపట్నం లిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



- ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్, ఉపసర్పంచ్ నుకం రాజు ముదిరాజ్

**మంచాల వెలుతురు ఏప్రిల్ 10:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఇబ్రహీంపట్నం లిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబి రం ఏర్పాటు వైద్య పరీక్షలు చేయించుకుని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆరుట్ల గ్రామసర్పంచ్ మా నిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకం రాజుముదిరాజ్ అనంతరం లిమ్స్ హాస్పిటల్ మేనేజర్ భాష గ్రా మపంచాయతీ పాలకమండలి సభ్యులను మాజీ ప్రజాప్రతినిధులను శాలువతో సన్మానించారు ఉచిత వైద్య శిబిరానికి ఆరుట్ల గ్రామంలోని ప్రజలు పెద్దఎత్తున వచ్చి వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకొని ఉచిత వైద్య శిబిరాన్నిసద్వినియోగంచేసుకున్నారు ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి చిలుకల వెంకటే ష్ మాజీ ఎంపీటీసీ చీరాలరమేష్ నిమ్స్ హాస్పిటల్ మేనేజర్ భాష గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పున్నం రాము కొండిగారి శ్రావణ్ మంద మాధవి మోహన్ రెడ్డి మాజీ డైరెక్టర్ కొంగర జనార్దన్ రెడ్డి గ్రామస్తులు పాం డాల యాదయ్య గౌడ్ లాలగారి జంగయ్య మహమ్మద్ సద్దాం ప్రజాగలం భూపాల్ లిమ్స్ హాస్పిటల్ వైద్యు లు సుమలత దినేష్ హాస్పిటల్ సిబ్బంది వినోద్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## జీడిమెట్ల డివిజన్ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమం.



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 10:**

భారతీయ జనతా పార్టీ(బీజేపీ) జాతీయ( మండల/డివిజన్)స్థాయి లో జరుగుతున్న ప్రశిక్షణ (బీజేపీ ట్రైనింగ్ క్యాంపు)లో భాగంగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు జీడిమెట్ల డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు ఆధ్వ ర్యంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 24 గంటల శిక్షణ తరగతులు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జీడిమెట్ల డివిజన్ బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి 24 గంటల శిక్షణ తరగతుల లో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి.

## అందరికి విద్య,వైద్యం,ఉద్యోగం కోసం సిపిఐ పోరాటం:




- సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 10:**

ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజున జగతగిరిగుట్ట డివిజన్ మైసమ్మ నగర్,అంజయ్య నగర్లో ఇంటింటికి సిపిఐ కర పత్రాన్ని పంచుతూ ప్రజలకు సిపిఐ చేసిన సేవ మరియు సిపిఐ అవశ్యకతను వివరించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహజ వనరులను ప్రజలందరికి సమానంగా పంపిణి చేసి అందరికి విద్య,వైద్యం మరియు నివాస సౌకర్యలను ప్రభుత్వమే ఇస్తే సమానత్వం వస్తుందని అలాంటి సమసమాజం కోసం సిపిఐ పోరాడుతుందని అన్నారు.మత,కుల, ప్రాంతం పేరుతో స్వంత ఆస్తులను పెంచుకోవడానికి చేసే రాజకీయ పార్టీలను గుర్తించి సమసమాజ కోసం పోరాటం చేసే సిపిఐ పార్టీ నీ ప్రజలు గుర్తించి సిపిఐ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,మండల సహాయ కార్యదర్శి హరినాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు,యువజన సంఘం కార్యదర్శి వెంకటేష్,సిపిఐ నాయకులు కృష్ణ వెంకటేష్, కొండయ్య,నర్సయ్య,సంతోష్,సత్యనారాయణ, వెంకట్ మామ,నగేష్,ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిసన్ కార్మికుల సమ్మె మూడో రోజు ఉధృతం –



- సైనిక్‌పురి డివిజన్‌లో గర్జించిన నిరసనలు

**సైనిక్‌పురి, ఏప్రిల్ 10 వెలుతురు:**

దక్షిణ మండల విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) ఆర్టిసన్ కార్మికుల నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరుకుని సైనిక్‌పురి డివిజన్‌లో ఉదృతంగా కొనసాగుతోంది. డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్‌లలో పనిచేస్తున్న ఆర్టిసన్ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని యాజమాన్య మొండి వైఖరికి నిరసనగా గట్టిగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, సంస్థను నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం, ఇప్పటి వరకు చర్చలకు ఆహ్వానించకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే తదుపరి దశలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ సర్కిల్ జేఏసీ చైర్మన్ వెంకట్ రెడ్డి, కిష్టాఫర్, జానయ్య, మల్లారెడ్డి, పైసా రవి, మోహన్ రావు, జానీ, ప్రసాద్, జమాల్, నరేష్ గౌడ్, విజయ్, కృష్ణ, రమేష్, రాజు, వెంకటేష్, దేవకుమార్, సుగుణ, లక్ష్మి, మమత, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుట్ల గ్రామంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

- కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజల కు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్

**మంచాల వెలుతురు ఏప్రిల్ 10:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న నిరుపేదల కుఇబ్రహీంప ట్నంఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ ఆ రుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ ఆధ్వ ర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇబ్రహీంప ట్నంమార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరీఎల్లేష్,గ్రామ శాఖ అధ్య క్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ కలిసి మాట్లాడుతూ ప్రవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నపేద ప్రజలకోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఎంతో ఆసరా వరంలాంటిది అని అన్నారు పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సీఎంరిలీఫ్ ఫండ్ పథకం పేద ప్రజల కోసం అని అన్నారు కాం గ్రెస్ పార్టీ ప్రభుత్వం పేదప్రజల కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రంగారె డ్డి గారి సహకారంతో అర్హులైన ప్రతిపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాంఅని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం మాజీ సర్పంచ్ ఆనంగళ్ళయాదయ్య గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు మహమ్మద్ ఇమాన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడ్డిమల్ల చంద్ర య్యముదిరాజ్ వెదిరె రమణా రెడ్డి అంతటి రాజుగౌడ్ మారసురేష్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నర సింహగౌడ్ కంబాల పల్లి బుగ్గరాములు బుట్టికృష్ణ ముదిరాజ్ మారల క్ష్మణ్ ఆరుట్ల గ్రామయూత్ కాంగ్రెస్ అ ధ్యక్షుడు బుడిగల పరమేష్‌నాయకులు మొహమ్మద్ గాలబ్ వస్పరి కుమార్ చీమర్ల గణేష్ దాసరమోని అ శోక్ ముదిరాజ్ మైనార్టీ నాయకుడు మహమ్మద్ అష్రఫ్ ఆడెపుమధులబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

## జిహెచ్ఎంసి నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం :

- నిజాంపేట్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి.

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 10:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలను కుత్బుల్లాపూర్ నియోజక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూల స్పందనతో బాచుపల్లి ప్రాంతం నిజాంపేట్ పరిధిలోని , కౌసల్య కాలనీలో హెచ్ఎల్‌జి హాస్పిటల్ నుండి సూర్యా గ్లోబల్ స్కూల్ వరకు రూ.60 లక్షల జిహెచ్ఎంసి నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిజాంపేట్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ రోడ్డు నిర్మాణంతో కౌసల్య కాలనీ వాసులకు, విద్యార్థులకు మరియు రాకపోకలకు పెద్ద ఎత్తున ఉపశమనం కలగనుంది.

అనంతరం కౌసల్య కాలనీ వాసులు, ఈ అభివృద్ధి పనులకు చొరవ చూపిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమంతన్న కి, అలాగే ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు మరియు తదితరులు పాల్గొన్నారు

### నేడు ఇబ్రహీంపట్నంకు కేటీఆర్ రాక

- బిఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం
- బిఅర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలి
- మంచాల మండలం బిఅర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చీరాల రమేష్

**మంచాల వెలుతురు ఏప్రిల్ 10:**

మంచాల మండలం కేంద్రంలోబిఅర్ ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ మాట్లాడుతూ శనివారం11.04.2026,ఉదయం 10గంటలకు బిఆర్ఎస్ జిల్లాపార్టీ అధ్యక్షులుమంచిరెడ్డి కిషన్ రెడ్డిగారి అధ్యక్షతన బొంగుళూరు ప్రమిదా గార్డెన్స్ లో జరిగే ఈసమావేశంలో ముఖ్యఅతిథులుగా బిఅర్ ఎస్ పార్టీ కా ర్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్)గారు మాజీమంత్రివర్యులు ఎమ్మెల్యేస బి తాఇంద్రారెడ్డి గారురాష్ట్ర నాయకులు క్యామమల్లేష్ గారు యువనాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటి)గారు పాల్గొంటారు నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లుసర్పంచులు ఉపసర్పం చు లు సభ్యులసన్మాన కార్యక్రమాలు తదుపరి సమావేశంనిర్వహించబడును.కావున ప్రజాప్రతినిధులు పార్టీ కా ర్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు సమయానికి పాల్గొనవలసిందిగా అని పిలుపునిచ్చారు

## లెనిన్ నగర్లోనీ సమస్యలు పరిష్కరించాలి:

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 10:**



చింతల్ సర్కిల్ రోడమేస్త్రి నగర్ డివిజన్ లేనిన్ నగర్లో బ్లాక్ 16,18 లో కరెంటు స్తంబాలు దూరంగా ఉండటం వల్ల ప్రజలు నిత్యం కరెంటు సమస్యతో ఇబ్బంది పడుతున్నారని ,ఈ విషయం పై గతంలో ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్ వారికి స్థానికులు సమస్య తీర్చాలని కోరినప్పటికి ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కావట్లేదని నేడు స్థానిక బస్తి సిపిఐ నాయకులు సాయిలు,స్థానికులు నాయకులు థౌర్యా లు చెప్పగా బస్తిని సందర్శించటం జరిగింది. స్థానికులు ఉమా మహేష్ కి తాము కరెంటు సమస్యతో ఇబ్బంది పడుతున్నామని అలాగే రోడ్డు సమస్య ఉన్నదని గుంతల వల్ల రాత్రి సమయంలో ప్రమాదల వల్ల గాయాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని ఈ విషయం పై గతంలో కూడా అధికారులకి తెలియచేసినప్పటికి సమస్య అలాగే ఉందని ఇప్పటికైన సమస్య తీర్చాలని కోరారు.సిపిఐ నాయకత్వన సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని స్థానికులకు తెలపడం జరిగింది.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సాయిలు,తోర్యా నాయక్,మూర్తి,మల్లారెడ్డి,సుమన్, దంజి,భాగ్య,శేఖర్ లు పాల్గొన్నారు.

## చెన్నారెడ్డిగూడ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

- సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిది కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్

**మంచాల వెలుతురు ఏప్రిల్ 10:**

మంచాల మండలం చెన్న రెడ్డి గూ డ గ్రామంలో ప్రవేట్ హాస్పిటల్ లో వైద్యం చేయించుకున్న నిరుపేదల కు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డిగారి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ల బ్ధిదారులు రామావత్ మౌనిక కు అందజేసిన చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లానాయకుడు ముచ్చర్ల వెంకటేష్ యా దవ్ ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ వైద్యంచేసుకోలేని స్థితిలో ఉన్న పే ద ప్రజలకు వరంలాంటిది అని అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉం టుంది అని అన్నారు ఈకార్యక్రమంలో చెన్నారెడ్డిగూడా కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పగడాల శ్రీశైలం యాదవ్ ప్రధాన కార్యదర్శి గ్యార రాజు మాజీ సర్పంచ్ కిషన్ నాయక్ గ్రామపంచాయతీ 6వ వార్డు సభ్య డు కాట్రోత్ హరియా నాయక్ ఇందిరమ్మకమిటీ సభ్యులు రత్నావత్ స్వామినాయక్ యూత్ కాంగ్రెస్ నాయకుడు వంశీనాయక్ ఉప్పల రాములు తదితరులు పాల్గొన్నారు



## ఏ ఎస్ రావునగర్‌లో మెఫిల్ రెస్టారెంట్ దందా

- బట్టబయలు... చెడు ఆహారం పై ప్రశ్నించగా వినియోగదారులపై దాడి!
- బిర్యానీ, స్వీట్స్ నాణ్యతపై తీవ్ర ఆరోపణలు – యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ – పోలీసులు విచారణ ప్రారంభం

**ఏఎస్ రావునగర్, ఏప్రిల్ 10 వెలుతురు:**




ఏఎస్ రావునగర్‌లోని రాధిక థియేటర్ ఎదురుగా ఉన్న మెఫిల్ రెస్టారెంట్‌లో ఆహార నాణ్యతపై వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. బిర్యానీ తినేందుకు వచ్చిన ముగ్గురు వినియోగదారులు సత్తిరెడ్డి, నరేష్, గణేష్ రెస్టారెంట్ అందించిన ఆహారం నాసిరకంగా ఉందని ఆరోపిస్తూ యాజమాన్యాన్ని నిలదీయగా, వారిపై దాడి జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తాయి.

బాధితుల వివరాల ప్రకారం, వారు ఆర్డర్ చేసిన బిర్యానీ చల్లగా ఉండటమే కాకుండా రుచి లేకుండా ఉండటం గమనించారు. అదేవిధంగా "ఖద్దూ కా కీర్" అనే స్వీట్ నుండి అసహ్యకరమైన వాసన వస్తోందని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని సిబ్బందికి తెలియజేయగా, ఆహారం బాగానే ఉందని చెప్పి మార్పిడి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.అయితే, చెడు వాసన వస్తున్న ఆహారం వినియోగదారులకు ఎలా అందిస్తారని ప్రశ్నిస్తూ, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించగా, రెస్టారెంట్ యాజమాన్యం మరియు సిబ్బంది కలిసి తమపై దాడికి దిగారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా నాసిరకమైన ఆహారం అందిస్తున్న రెస్టారెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, కుళ్లిన చికెన్, చెడిపోయిన బిర్యానీని ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి మరుసటి రోజు వినియోగదారులకు అందిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేశారు.

ఘటనపై సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీసులు వెంటనే స్పందించి రెస్టారెంట్ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఇదిలా ఉండగా, మెఫిల్ రెస్టారెంట్ ముందు ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌పై వాహనాలు అనధికారికంగా పార్క్ చేయడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ అంశంపైనా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:

శుక్రవారం రోజున హోమియోపతి దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ డివిజన్ లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో నిర్వహించబడ్డ హెల్త్ క్యాంప్. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ విచ్చేశారు.

## శాతవాహన యూనివర్సిటీలో దళిత ప్రొఫెసర్, విద్యార్థులను నక్సలైట్ పేరుతో వేధింపులు మానుకోవాలి

- యూనివర్సిటీ స్వయం ప్రతిపక్షం కాపాడాలి



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:

గత కొన్ని వారాలుగా దళిత ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతను, దళిత విద్యార్థి కరికే మహేష్ లను అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరించి వేధించడాన్ని తక్షణమే ఆపివేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ కె. చక్రధరరావు, ప్రొఫెసర్ జి. హరగోపాల్ ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణలు డిమాండ్ చేశారు.

కొంతమంది విద్యార్థులు కలిసి సోషియాలజీ డిపార్ట్మెంట్ హెడ్ గా ఉన్న ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతను, అదేవిధంగా ఎకనామిక్స్ విభాగ విద్యార్థి కరికే మహేష్ లను ఏ ఆధారాలు లేకుండా మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఉన్నాయని, అర్బన్ నక్సలైట్లని కలెక్టరుకు, పార్లమెంటు సభ్యులకు ఫిర్యాదులు చేస్తూ వివిధ మాధ్యమాలలో అసత్య ప్రచారం చేస్తున్నారు. అన్ని అర్హతలు అనుభవం ఉన్నప్పటికీ డీన్గా ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న దళిత మహిళా ప్రొఫెసర్ ను తొలగించడం కక్షపూరిత చర్య కింద వస్తుంది. ఈ పరిణామాల వలన గ్రామీణ ప్రాంతాల నుండి, దళిత, ఆదివాసీ సమూహాల నుండి వచ్చి చదువుకుంటున్న ఈ యూనివర్సిటీ అకాడమిక్ వాతావరణం కలుషితమై, విశ్వవిద్యాలయ స్వయంప్రతిపత్తి దెబ్బ తింటూ ఉన్నదని వారు అన్నారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతి, విద్యా విషయకస్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛలను కాపాడవలసిన వైస్ చాన్సలర్ మౌనంగా ఉండడం సరికాదు. విద్యా వ్యాపారీకరణ, అతికేంద్రీకరణ, మత ఉన్మాదం పెరుగుతున్న ఈ కాలంలో అణగారిన వర్గాల నుండి వచ్చిన ప్రొఫెసర్ అందులో మహిళా ప్రొఫెసర్ వేధించడం లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత యూనివర్సిటీ పాలన యంత్రాంగానికి ఉన్నది.

ఇప్పటికైనా ఇటువంటి నిరాధారమైన ఆరోపణలు, వేధింపులు, కక్ష పూరిత చర్యలు మానుకొని యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తి, అకాడమిక్ వాతావరణం కాపాడాలని వారు వైస్ ఛాన్సలర్ ను కోరారు

# హరీష్ రావు పెద్ద బ్లాక్ మెయిలర్



- షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్
- హరీష్ రావు కు అబద్ధాల అవార్డు ఇవ్వచ్చు
- కాలేశ్వరం ప్రాజెక్టు పేరిట దోచుకున్నారు
- 80 వేల పుస్తకాలు చదివింది పచ్చి అబద్ధాల కోసమే
- వీళ్ళ మోసాలను గమనించినందునే ప్రజలు ఫామ్ హౌస్ కు పరిమితం చేశారు
- అసెంబ్లీ సీఎల్పీ కార్యాలయంలో మీడియా సమావేశం
- మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మీడియా సమావేశం

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:

తెలంగాణలో హరీష్ రావు పెద్ద బ్లాక్ మెయిలర్ గా మారాడనీ అబద్దాల అవార్డు ను మాజీ మంత్రి హరీష్ రావుకు ఇవ్వచ్చని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఘాటుగా విమర్శించారు.

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలోనీ సిఎల్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై మాజీ మంత్రి టి. హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై షాద్నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

80 శాతం పనులు పూర్తయ్యాయి" అన్న హరీష్ రావు వ్యాఖ్యలు ప్రజలను మోసం చేయడమేనని ఆయన ధ్వజమెత్తారు.పథకం పనులు 80 శాతం పూర్తయ్యాయని చెప్పడం పచ్చి అబద్ధమని, వాస్తవానికి 80 శాతం పనులు పూర్తికాలేదని స్పష్టం చేశారు.

పనులు పూర్తికాకపోయినా, నిధులు మాత్రం 80 శాతం దోచుకున్నారనే అనుమానాలు ప్రజల్లో బలంగా ఉన్నాయి" అని తీవ్ర ఆరోపణలు గుప్పించారు.హరీష్ రావు నిరాధార ఆరోపణలు, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించిన శంకర్, "సిగ్గు, శరం లేకుండా మాట్లాడటం ఆయనకు అలవాటైపోయింది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అబద్ధాల పై అవార్డులు ఇస్తే ప్రపంచ స్థాయి అవార్డు హరీష్ రావుకే వస్తుంది" అని ఎద్దేవా చేశారు.ఇక కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు చేస్తున్న విమర్శలను కూడా ఆయన ఖండించారు.ప్రజలు కాంగ్రెస్పై నమ్మకం ఉంచారు. రాబోయే పదేళ్లు కాంగ్రెస్ అధికారంలోనే ఉంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. 80 వేల పుస్తకాలు చదివానని చెప్పుకునే వ్యక్తి , ఆ పుస్తకాలన్నీ అబద్ధా చెప్పేందుకేనంటూ అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు.ప్రజల అభివృద్ధి కంటే రాజకీయ లాభాల కోసం తప్పుడు ప్రచారం చేయడం తగదని హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి పథకం వంటి కీలక ప్రాజెక్టులపై వాస్తవాలను దాచిపెట్టి ప్రచారం చేయడం ప్రజలను మోసం చేయడమేనని, దీనిపై ప్రజలు సరైన సమాధానం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు..

# తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల అత్యవసర సమావేశం

బషీర్ బాగ్ వెలుతురు 10 ఏప్రిల్ :



తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక మరియు పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (TGEJAC) రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి కార్యనిర్వాహక సమావేశం లో తీసుకున్న తీర్మానాల మేరకు, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించే కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఈ కార్యక్రమం లొ భాగంగా తెలంగాణ రాష్ట్రం లోని అన్ని (33) జిల్లాల్లో, హైదరాబాద్ సిటీ (HOD), సెక్రటేరియట్‌తో పాటు మండల, డివిజన్ మరియు జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశాము రాష్ట్రంలోని సుమారు 15.25 లక్షల ఉద్యోగులను ప్రతినిధిత్వం వహిస్తున్న 206 సంఘాల తరపున ఈ చర్యలు చేపట్టబడుతున్నాయి.

TGEJAC ప్రధానంగా నాలుగు కీలక డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాము.

**2వ పిఆర్సి అమలు**

పిఆర్సి కమిటీ ఏర్పాటు అయ్యి దాదాపు 30 నెలలు పూర్తయిన నేపథ్యంలో, 51% ఫిట్‌మెంట్‌తో 2వ పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించి, జూన్ 2లోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్సి కాలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించరాదని స్పష్టం చేశారు. లేనిపక్షంలో తదుపరి కార్యాచరణ చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

**పెండింగ్ బిల్లుల విడుదల**

రాష్ట్రంలో సుమారు ₹13,000 కోట్ల పెండింగ్ బిల్లులను ఏకమొత్తంగా విడుదల చేసి, ప్రతినెల రిటైర్ అవుతున్న ఉద్యోగులు మరియు పెన్షనర్లకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఆరోగ్య కార్డుల అమలు (EHS)**

ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య కార్డుల అమలులో జరుగుతున్న ఆలస్యాన్ని వెంటనే తొలగించి, కొత్త EHS విధివిధానాలను రూపొందించి, మే 1 నుంచి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

**CPS రద్దు - OPS పునరుద్ధరణ**

రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం (CPS) ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (OPS)ను పునరుద్ధరించాలని, అలాగే 01092004కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు వెంటనే OPS అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇవి కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన మిగిలిన దీర్ఘకాలిక పెండింగ్‌లో ఉన్న 64 అంశాలను కూడా ప్రభుత్వం తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని TGEJAC కోరింది.

**ఈ కార్యక్రమంలో**

పాల్గొన్నవారు.మారం జగదీశ్వర్ చైర్మన్
ఏలూరి శ్రీనివాస్ రావు
సెక్రటరీ జనరల్
P. దామోదర్ రెడ్డి, బి. శ్యామ్
జి. సదానందం గౌడ్, కటకం రమేష్రా.
రామారావు
బిక్షం గౌడ్,జుట్టు గజేందర్
పి. వెంకట్ రెడ్డి పర్వత్ రెడ్డి పాల్గొన్నారు.

## తప్పిపోయిన 4 ఏళ్ల చిన్నారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన పటాన్‌చెరు పోలీసులు

పటాన్‌చెరు వెలుతురు ఏప్రిల్ 10:



పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఒక చిన్నారిని పోలీసులు అత్యంత వేగంగా స్పందించి గంటల వ్యవధిలోనే తల్లి ఒడికి చేర్చారు. శుక్రవారం రోజున ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో, పటాన్‌చెరు బస్టాండ్ ఆవరణలో 4 సంవత్సరాల వయసున్న ఒక చిన్నారి తన తల్లిదండ్రులు లేక ఒంటరిగా తిరుగుతూ ఏడుస్తుండటాన్ని గమనించిన స్థానికులు, వెంటనే ఆ పాపను పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

పాప వివరాలను సేకరించే క్రమంలో పటాన్‌చెరు పిఎస్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ మరియు ఐటీ కోర్ కానిస్టేబుల్ రవిలు చాకచక్యంగా వ్యవహరించారు.

చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆరా తీయగా, ఆ చిన్నారి కజిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నట్లు సమాచారం లభించింది. ఈ ఆధారంతో వెంటనే పాప తల్లిదండ్రులను గుర్తించి వారికి సమాచారం అందించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పాప తల్లి అనితకు, చిన్నారిని పోలీసులు క్షేమంగా అప్పగించారు.

సకాలంలో స్పందించి చిన్నారి ఆచూకీ కనుగొన్న కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ మరియు ఐటీ కోర్ కానిస్టేబుల్ రవిలను పటాన్‌చెరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ వినాయక రెడ్డి గారు ప్రత్యేకంగా అభినందించి, వారి పనితీరును మెచ్చుకున్నారు. తమ బిడ్డను క్షేమంగా అప్పగించినందుకు పాప తల్లిదండ్రులు పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మహాత్మ జ్యోతి బాపులే 199వ జయంతి



- ఉత్సవ కమిటీ కో కన్వీనర్ గా జాజుల లింగంగౌడ్

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న రాష్ట్ర ప్రభుత్వం హైద్రాబాద్ లోని రవీంద్ర భారతిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సంఘ సంస్కర్త,సామాజిక విప్లవ కారుడు మహాత్మా జ్యోతి బాపులే జయంతి ఉత్సవ కమిటీ కో కన్వీనర్ గా బీసీ సంఘం రాష్ట్ర నాయకులు జాజుల లింగంగౌడ్ నియామకం జరిగింది.ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నన్ను రాష్ట్ర ఉత్సవ కమిటీ కో కన్వీనర్ గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి,టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గారికి,ఉత్సవ కమిటీ చైర్మన్ వి.హనుమంతరావు గారికి బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ గారికి ధన్యవాదాలు తెలియజేశారు.

## కల్లు గీత కార్మికులకు ఉపాధి కల్పించే ఈత వనాన్ని తగలబెట్టడం దుర్మార్గమైన చర్య: కేజీకేఏస్

- ఇలాంటి అరాచకాలను ప్రభుత్వం అరికట్టాలి. ఈత వనంను నిప్పుతో ధ్వంసం చేసిన వారినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోండి
- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎంవి. రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిజామాబాద్ టిసిఎస్ ఒకటో షాపుకు సంబంధించిన వేలాది ఈతవనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుతో ధ్వంసం చేయడం తగలబెట్టడం ఇది దుర్మార్గమైన చర్య ఈ చర్యను రాష్ట్ర ప్రజలు మేధావులు ప్రజాతంత్ర వాదులు ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. గీత కార్మికుల వృత్తికి ఉపాధి కల్పించే ఈత చెట్లను తగుల పెట్టిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే గీత కార్మికులకు నష్టపరిహారం చెల్లించి వృత్తికి అనువైన తాటి, ఈత ,ఖర్జూర, గిరక, జీలుగు,పొట్టి వంగడాలను ప్రభుత్వమే నాటి గీత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులని రాజకీయ పార్టీలకతీతంగా ఏకం చేసి ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలియజేశారు

## క్రీడలు మానసిక,శారీరక దృఢత్వానికి ఉపయోగపడతాయి



- ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను ప్రారంభించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:

రాష్ట్ర ప్రభుత్వం యువతను క్రీడల వైపు ప్రోత్సహించడానికి మరియు శారీరక దృఢత్వాన్ని పెంచడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ ఆధ్వర్యంలో నిజాం కాలేజీలో జరుగుతున్న క్రీడా పోటీలను లింగం గౌడ్ పాల్గొని మొదటి రోజు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ ఆటలో గెలుపోటములు సహజమని ఈ ఆటలో ఓడిపోతే కృంగిపోకుండా మరోసారి ప్రయత్నించి విజయం సాధించాలన్నారు.క్రీడా పోటీలు శారీరక దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని అన్నారు.సెల్ ఫోన్ ప్రపంచమైన ఈ రోజుల్లో ఆటలకు ఎవరు యువత సమయం ఇవ్వడం లేదన్నారు. అలాంటిది విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొనడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రం, బీసీ యువజన సంఘం అధ్యక్షులు కనకాల శ్యామ్ కుర్మా ఈడిగా శ్రీనివాస్ వీరస్వామి ఇంద్రం గూడూరు భాస్కర్ మహేష్ వరుణ్ ప్రణీత్ లక్ష్మణ్ శివతేజ వికాస్ ప్రమోద్ రోహిత్ సాయికుమార్ సంజయ్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు

## అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో మెరిసిన సైబరాబాద్ పోలీసులు

- విజేతల ను అభినందించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

సైబరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:



నాగ్‌పూర్‌లో జరిగిన 69వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ (AIPDM)లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అధికారులు అసాధారణ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం వరుసగా మూడోసారి 'చార్మినార్ ట్రోఫీ'ని కైవసం చేసుకొని చరిత్ర సృష్టించింది. రాష్ట్రానికి వచ్చిన మొత్తం 12 పతకాల్లో, సగం అంటే 6 పతకాలను (3 గోల్డ్, 1 సిల్వర్, 2 బ్రాంజ్) ఒక్క సైబరాబాద్ పోలీసులే సాధించడం విశేషం.

ఈ విజయం పట్ల హర్షం వ్యక్తం చేసిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఈరోజు సైబరాబాద్ కమిషనరేట్ ఆడిటోరియంలో విజేతలను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబరాబాద్ యూనిట్‌లో ఇంతటి నిష్ణాతులైన అధికారులు ఉండటం గర్వకారణమని కొనియాడారు. నిరంతరం బందోబస్తులు, శాంతిభద్రతల పరిరక్షణ వంటి విధుల్లో నిమగ్నమై ఉండి కూడా, సమయాన్ని కేటాయించి జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం వారి సంకల్పానికి నిదర్శనమని అన్నారు.

పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచేందుకు కమిషనరేట్ తరపున ప్రత్యేక శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామని, అధికారుల కమిట్మెంట్ చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుందని సీపీ ప్రశంసించారు.

గోల్డ్ మెడల్ సాధించిన వారికి మూడు ఇంక్రిమెంట్లు, సిల్వర్ మెడల్ విజేతలకు రెండు ఇంక్రిమెంట్లు మరియు బ్రాంజ్ మెడల్ సాధించిన వారికి ఒక ఇంక్రిమెంట్ అందజేస్తామని తెలిపారు. ఈ రివార్డులు అధికారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించడానికి దోహదపడతాయని ఆయన ఆకాంక్షించారు.

అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ సిబ్బంది విశిష్ట ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో పతకాలు సాధించారు. పి. జయప్రకాశ్ గౌడ్ (ఎస్ఐపీ) మెడికోలీగల్ ఓరల్ విభాగంలో రజత పతకం, కె. రాధిక యాదవ్ (ఎస్ఐపీ) అదే విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఎం.వి.ఎస్.ఎన్. రెడ్డి (ఏఆర్ఎస్ఐ) కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో స్వర్ణ పతకం, ఎం. దేవేంద్ర ప్రసాద్ (ఏఆర్హెచ్‌సీ) వీడియోగ్రఫీలో స్వర్ణ పతకం, ఆర్. దివాకర్ రెడ్డి (ఏఆర్‌పీసీ) యాంటీ సాబోటాజ్ చెక్-వాహనాల తనిఖీ విభాగంలో స్వర్ణ పతకం అందుకున్నారు. టీ. సురేష్ (ఏఆర్‌పీసీ) కూడా వీడియోగ్రఫీ విభాగంలో పతకం గెలుచుకున్నారు. మొత్తం తెలంగాణకు వచ్చిన 12 పతకాలలో 6 పతకాలను సైబరాబాద్ పోలీసులు సాధించడం విశేషం. అదనంగా, జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు చెందిన ఆర్. ప్రేమ్ సాగర్ (ఎస్ఐపీ) 'సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్' విభాగంలో ఓవరాల్ రన్నర్స్ ట్రోఫీని కైవసం చేసుకోవడం మరో గర్వకారణంగా నిలిచింది.

ఈ కార్యక్రమం లో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్., అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్., శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., ట్రాఫిక్ డీసీపీ II శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ట్రాఫిక్ డీసీపీ 1 రంజన్ రతన్ కుమార్ మరియు వివిధ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం



**గుండాల ఏప్రిల్ 10(వెలుతురు)**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం లో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ముగించుకున్న సందర్భంగా వార్డు సభ్యులకు ఎంపీడీవో చండీరాణి చేతుల మీదుగా శిక్షణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చండి రాణి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సర్పంచ్ కి సహకరించుతూ తీర్మానాలు చేసుకుని పనులను వేగవంతం చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఎంఏ సలీం, సీనియర్ అసిస్టెంట్ దేవేందర్, జూనియర్ అసిస్టెంట్ రవీందర్ రెడ్డి, శిక్షణ అధికారులు,కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకాంత్ , వివిధ గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**గుండాల ఏప్రిల్ 10(వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగా గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన గూడేపు పరుశురాములు కుటుంబానికి ఆలేరు మాజీ శాసనసభ్యులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు బూడిద బిక్షమయ్యగౌడ్ సహకారంతో మరిపడిగా గ్రామ శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు అనంతుల చంద్ర శేఖర్, గ్రామ ఉప సర్పంచ్ చొప్పరి సోమయ్య, వార్డు సభ్యులు బండారి సుభాష్, పానుగంటి గణేష్, పానుగంటి వెంకటమ్మ , బూడిద సోమయ్య,మాజీ ఉప సర్పంచ్ తోటకూరి శ్రీనివాస్ కొండబోయిన సోమయ్య, గోల్కొండ బిక్షపతి, బిఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ శాఖ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# కంటే కూతుర్నే కనాలి రా

- **తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు**
- **పలువురు కంటతడి పెట్టిన వైనం**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 10:**



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన దోర్నాల రాములు అకాల మృతిచెందగా ఆయనకు నలుగురు కూతుర్లు ఉండగా పెద్ద కూతురు రమాదేవి తండ్రికి తలకొరివి పెట్టి పలువురిని కంటతడి పెట్టించింది .రెండవ కూతురు రజిని మూడవ కూతురు విజయ, నాలుగవ కూతురు కల్పన మొత్తం నలుగురు కూతుర్లు తండ్రి మరణంతో తనయురాలు తలకొరివి పెడుతుంటే గ్రామస్తులు కంటతడి పెట్టారు, కంటే కూతుర్నే కనాలి రా అన్న విధంగా పలువురిని,ఆలోచింపజేశారు. ఏది ఏమైనా కూతురు తల కొరివి పెట్టడం ఒక విశేషం ఈ యొక్క దహన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ గ్రామ పెద్దలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా జయించవచ్చు..

- **రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ...**

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో హెల్త్ వీక్ లో భాగంగా శనివారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రహదారులు మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు.

జీవితంలో మనం అనువదను భవిష్యత్తులో పిల్లలకు యోగ నేర్పించడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయని దీనివల్ల జ్ఞాపక శక్తితో పాటు ఒత్తిడి తగ్గుతాయని అదేవిధంగా గారు పాల్గొని ప్రజలు నిత్యజీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలని మంత్రి సూచించారు.

ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఒక సమగ్ర పరిష్కారమని అన్నారు. యోగా సాధన ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని నిత్యజీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి జీవన శైలి సంబంధిత వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. యోగా కేవలం వ్యాయామ పద్ధతి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానమని, దీన్ని ప్రతిరోజూ ఆచరించడం ద్వారా శరీరానికి దృఢత్వం, మనసుకు ప్రశాంతత లభిస్తాయని అన్నారు. యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందడమే కాకుండా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభించడం వల్ల వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మొత్తానికి సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు జిల్లాలో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయడం అత్యంత అవసరమని కలెక్టర్ అన్నారు

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ మెడికల్ , హెల్త్ శ్రీమతి క్రిస్టినా చోగ్తూ మరియు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి ,హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి జిల్లాఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ షీబా హయత్ డాక్టర్ పూనం డిపిఓ అక్రమ్ మరియు అధికారులు సిబ్బంది విద్యార్థులు

# కామ్రేడ్ కల్లూరి యాదగిరి స్మారక స్థూపావిష్కరణ సభను జయప్రదం చేయండి

- **సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపు**

**నార్కట్ పల్లి వెలుతురు ఏప్రిల్ 10:**



ఈనెల 12న సిపిఐ(ఎం) నార్కట్ పల్లి మండల కమిటీ సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ కామ్రేడ్ కల్లూరి యాదగిరి గారి స్మారక స్థూపావిష్కరణ సభను ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు నార్కట్ పల్లి మండల కేంద్రంలో కరపత్రికను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిపిఐ (ఎం) మండల కమిటీ సభ్యుడు మరియు నార్కట్ పల్లి మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి గారు 2025 జనవరి 19న ఆకస్మికంగా మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. గీత కార్మిక కుటుంబంలో జన్మించిన యాదగిరి గారు విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు ప్రదర్శించి హైస్కూల్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. పేదల కష్టాలను చూసి కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై వెట్టి చాకిరి నిర్మూలన కోసం పోరాటం ప్రారంభించారు. 1995 నుండి 2000 వరకు ఎంపీటీసీగా సేవలందిస్తూ దేవాదాయ, సీలింగ్, పోరంబోకు భూములను పేదలకు పంచాలని పాదయాత్రలు చేసి అనేక ఉద్యమాలు నడిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా 2006 నుండి 2011 వరకు సర్పంచిగా కొనసాగుతూ ఎల్లారెడ్డిగూడెం, శేరుబావిగూడెం, దాసరిగూడెం గ్రామాల అభివృద్ధికి కృషి చేశారు. ప్రజా ప్రతినిధిగా పేదలకు భూములు పంచడం, గ్రామాభివృద్ధి కోసం కృషి చేయడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. బ్రాహ్మణ వెల్లాముల ఎత్తిపోతల పథకం, యూనివర్సిటీ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని ముందుండి పోరాటాలు చేశారు. ఈ క్రమంలో పలుమార్లు కేసులు ఎదుర్కొని జైలుశిక్షలు అనుభవించినా వెనుదిరగలేదు.

2019 నుండి 2024 వరకు రెండవసారి ఎంపీటీసీగా గెలిచి నార్కట్ పల్లి వైస్ ఎంపీపీగా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. పార్టీలకతీతంగా సేవ చేస్తూ, నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందారు.

యాదగిరి గారి మరణం సిపిఐ(ఎం) పార్టీకి మాత్రమే కాకుండా ఎల్లారెడ్డిగూడెం ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రజలంతా ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఈనెల 12న జరిగే స్మారక స్థూపావిష్కరణ సభకు పార్టీలకతీతంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయన్న, సీనియర్ నాయకులు ఎస్.ఆర్. వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు చెరుకు పెద్దులు, కుమ్మరి శంకర్, కొప్పు శ్రవణ్, దండు రవి, ఆమనగంటి ఐలయ్య, బొల్లెద్దు సైదులు, సోమనబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే ఉత్సవకమిటీ కన్వినర్ గా

- **పల్లగొర్ల మోదీరాందేవ్ ను నియమించిన ప్రభుత్వం**

**నార్కట్ పల్లి వెలుతురు ఏప్రిల్10:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్గా మాజీ ఎంపీ VH హనుమంత రావు, వైస్ చైర్మన్ లను, కన్వినర్ గా పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ ను నియమిస్తూ శుక్రవారం జీవో నె .174 జారీ చేయడం జరిగింది ప్రభుత్వం

వారు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే మహనీయుని కమిటీలో చోటుదక్కడం అదృష్టంగా భావిస్తున్నాను 16 సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల కోసం తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసినందుకుగాను గుర్తించి కన్వినర్ గా బాధ్యతలు ఇచ్చిన ప్రభుత్వానికి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్య సభ MP ఆర్ కృష్ణన్నకు ప్రత్యేక ధన్యవాదాలు పాదాభివందనాలు తెలియజేశారు , బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్, పూలే కమిటీ చైర్మన్ వి.హెచ్ హనుమంతరావు అన్నకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు 11వ తేదీన రవీంద్రభారతిలో మరియు జిల్లా కేంద్రాలతో పాటు మండల మరియు గ్రామ గ్రామ పెద్ద ఎత్తున పాల్గొని



ఉత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు

# ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో ప్రజా సమస్యలపై అధ్యయనం చేస్తున్న సిపిఐ నాయకులు.

- **సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ...**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 10:**




సిపిఐ ఇంటింటికి కార్యక్రమంలో భాగంగా రామన్నపేట మండలం కేంద్రంలోని పద్మశాలి కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలపై అధ్యయనం చేశామని సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి చేయాలని, అరులైన వారందరికీ పింఛన్లు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదవారికి ఇవ్వాలని, రైతు భరోసాను సకాలంలో వేసి రైతులకు పెట్టుబడి సాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని సిపిఐ ప్రతిపక్ష పాత్ర అసెంబ్లీలో ఘనంగా పోషిస్తున్నదని వారు అభినందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, గంగాపురం వెంకటయ్య, ఎర్ర బిక్షపతి, కళ్ళెం యాదగిరి, రచ్చ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల ఇటుక తయారి యూనిట్లకు భారీ ఆదాయం

- **ఉపాధి, గృహ నిర్మాణానికి డబుల్ లాభం**

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:**

తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఇటుక తయారీ యూనిట్లను బలోపేతం చేసేందుకు సమగ్ర చర్యలు చేపట్టింది. జీవనోపాధి అవకాశాలను పెంచడమే కాకుండా, ప్రభుత్వ గృహ నిర్మాణ కార్యక్రమాలకు అవసరమైన నిర్మాణ సామగ్రిని స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం అమలు అవుతోంది.

కొత్త యూనిట్ల స్థాపనకు ముందు, ప్రస్తుతం మహిళా సంఘాలు నిర్వహిస్తున్న యూనిట్ల స్థితిగతులను తెలుసుకునేందుకు సెర్ప్ సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించారు. జిల్లాల్లో పర్యటించి మొత్తం 736 యూనిట్లు నడుస్తున్నట్లు గుర్తించారు. ఒక్కో యూనిట్ కు అవసరమైన పెట్టుబడి, ఉత్పత్తి సామర్థ్యం, కార్మిక అవసరాలు తదితర అంశాలపై సమగ్ర వివరాలు సేకరించారు.

ప్రస్తుతం ఈ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పని చేయడం లేదని గుర్తించారు. రోజుకు కేవలం 300 నుంచి 1000 ఇటుకల వరకు మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. అయితే పూర్తి స్థాయిలో నడిస్తే రోజుకు 2,000 నుంచి 2,500 ఇటుకలు తయారు చేసే సామర్థ్యం ఉంది. ఇందుకు ఒక్కో యూనిట్ కు సుమారు రూ.18 లక్షల పెట్టుబడి అవసరమని అంచనా వేశారు.

ఈ నేపథ్యంలో పీఎంఈజీపీ (PMEGP) పథకం ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ పథకం కింద 35 శాతం సబ్సిడీ లభిస్తుంది. జిల్లా పరిశ్రమల అధికారులతో చర్చలు పూర్తి చేసి, డీపీఆర్లు సిద్ధం చేసి పంపించారు. త్వరలోనే రుణాల మంజూరు ప్రక్రియ పూర్తి అవుతుందని సెర్ప్ అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో అవసరమైన వారికి బ్యాంకుల ద్వారా, స్త్రీ నిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తూ ఇటుక తయారీ యూనిట్లను అప్ గ్రేడ్ చేస్తున్నారు. నిర్వహకుల నైపుణ్యాన్ని మెరుగుపరిచే విధంగా 15 రోజుల పాటు శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సహంతో ఇప్పటికే పదుల సంఖ్యలో ఇటుక తయారి యునిట్లు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి.

అయితే మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఇటుకల తయారికి తగిన డిమాండ్ ను కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు అవసరమైన ఇటుకలను మహిళా సంఘాల యూనిట్ల నుంచే కొనుగోలు చేసేలా హౌసింగ్ శాఖతో సమన్వయం చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో మహిళా సంఘాలచే నిర్వహిస్తున్న ఇటుకల తయారి పరిశ్రమకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, “మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడటానికి స్థిరమైన ఆదాయ వనరులు అవసరం. ఇటుక యూనిట్లు మహిళలకు ఉపాధి కల్పించడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతు అందిస్తుంది” అని తెలిపారు.

సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూ, “రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనిట్లను బలోపేతం చేయడానికి శిక్షణ, రుణాలు, సబ్సిడీలు, మార్కెట్ లింకేజీ వంటి అన్ని అంశాల్లో సహకారం అందిస్తున్నాం. మహిళా సంఘాలు నిర్వహిస్తున్న యూనిట్లు ఆదర్శంగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నాం” అని పేర్కొన్నారు.

**మహిళా సంఘం ద్వారా విజయం సాధించిన కుంట మల్ల వాణి**

సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన కుంట మల్ల వాణి మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచారు. 2011లో ‘చైతన్య’ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరిన ఆమె, 15 సంవత్సరాలుగా సంఘ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

సిద్ధిపేటలో 15 రోజుల శిక్షణ పొందిన తర్వాత, పీఎంఈజీపీ పథకం ద్వారా రూ.10 లక్షల ప్రాజెక్ట్ తో పోతారంఎస్ గ్రామంలో ఇటుక తయారీ యూనిట్ ను స్థాపించారు. ఇందులో రూ.9.5 లక్షలు బ్యాంకు రుణంగా, రూ.50 వేల స్వంత నిధులు వినియోగించగా, ప్రభుత్వం నుంచి 35 శాతం సబ్సిడీ లభించింది.

ప్రస్తుతం ఆమె యూనిట్ పూర్తి స్థాయిలో పని చేస్తోంది. నెలకు రూ.3.02 లక్షల ఆదాయం వస్తుండగా, ఖర్చులు పోయిన తర్వాత సుమారు రూ.57 వేల నికర లాభం పొందుతున్నారు. ఈ యూనిట్ ద్వారా 6 మంది కార్మికులకు ఉపాధి లభించగా, కుటుంబంలోని ఇద్దరు సభ్యులు కూడా పనిచేస్తున్నారు.

మహిళా సంఘాల ద్వారా పొందిన బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి రుణాలతో ఆమె ఆర్థికంగా మరింత బలపడింది. ఈ ఆదాయంతో స్వంత ఇల్లు నిర్మించుకోవడమే కాకుండా, పిల్లలకు మంచి విద్య అందిస్తున్నారు.

మిర్జాపూర్, పోతారంఎస్ గ్రామాలతో పాటు హుస్నాబాద్ పట్టణంలో మార్కెట్ ఏర్పరుచుకుని, తన ఉత్పత్తులను విజయవంతంగా విక్రయిస్తున్నారు. తన విజయంపై స్పందిస్తూ కుంట మల్ల వాణి, “మహిళా సంఘంలో చేరడం నా జీవితాన్ని మార్చింది. సరైన శిక్షణ, ఆర్థిక సహాయం ఉంటే మహిళలు కూడా పెద్ద స్థాయిలో వ్యాపారాలు నిర్వహించగలరు” అని తెలిపారు.

ఈ విధంగా మహిళా సంఘాల ద్వారా ఇటుక యూనిట్లను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించడంతో పాటు, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# రామన్నపేటలో పురుషోత్తం రెడ్డి సేవలు మరువలేనివి




- **కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ సర్పంచ్ పల్లివాడ**
- **రామన్నపేట సాధన సమితి అధ్యక్షులు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 10:**

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుల్లో పురుషోత్తం రెడ్డి ఒకరు రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు గత సంవత్సరం నుంచి చేస్తూ వస్తున్నాం. పురుషోత్తం రెడ్డి చరిత్రను తెలుసుకోవడం చాలా గొప్ప విషయమని పత్రికా ప్రకటనలో తెలిపినారు. ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి యాదాద్రి జిల్లా అడ్డగూడూరు గ్రామంలో 1933 లో జన్మించారు మొదటిసారిగా అడ్డగూడూరు సర్పంచిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించినారు రెండుసార్లు శాసనసభ్యునిగా రెండుసార్లు శాసనమండలి సభ్యునిగా ఎన్నికైనారు. డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా ఏఐసీసీ చైర్మన్గా తెలంగాణ ప్రాంతీయ అభివృద్ధి మండలి చైర్మన్గా పని చేసినారు. 1947లో కాంగ్రెస్ పార్టీలో చేరినారు. హైదరాబాద్ రాష్ట్ర విమోచన ఉద్యమంలో నిజాం కు వ్యతిరేకంగా పోరాటం చేసినారు. 1957 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్లో స్నేహపూరిత వాతావరణ కొరకు మంచి సందేశం పేరిట యాత్ర నిర్వహించినారు. 1969 లో ఎమ్మెల్సీగా ఎన్నికైనారు. 1969 నుంచి 1972 వరకు రామన్నపేట నియోజకవర్గానికి చెందిన ఇతను చిన్ననీటి వనరుల శాఖ మంత్రిగా పని చేసినారు. 1974 నుంచి 1977 వరకు ఆబ్కారి గనుల శాఖ మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత మోత్కూర్ సమితి ప్రెసిడెంట్ గా పని చేసినారు. రాజకీయాల్లో అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటూ ముందడుగు వేసినారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో లాబీయింగ్ తో రాష్ట్రంలో రాజకీయాలను సాచించినారు. రాజకీయాల్లో తనదైన శైలిలో తన ముద్ర వేసినారు. ఆయన తెలంగాణ వారిగా ప్రత్యేక గుర్తింపు ఉన్నది. కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి నేతనైన వ్యతిరేకించే వ్యక్తిగా ఆయనకు పేరుంది. రెండుసార్లు శాసనసభ్యులుగా ఒకసారి ఎమ్మెల్సీగా పని చేసినారు. ఎమ్మెల్సీగా ఉన్న కాలంలో 1973లో ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి మంత్రివర్గంలో ఓడరేవుల మంత్రిగా జలగం వెంగళరావు మంత్రివర్గంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేసినా సమయంలో రామన్నపేట నియోజకవర్గానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు తీసుకువచ్చినారు. రామన్నపేట మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు ఫైర్ స్టేషన్ ఏర్పాటు రామన్నపేట ఏరియా హాస్పిటల్ లో ఏర్పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు ఈ నియోజకవర్గానికి తీసుకువచ్చినారు. రామన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచిన వారిలో ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి ఒకరుగా ఉండడం చాలా గొప్ప విషయమని తెలిపినారు. నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో అనేక కార్యక్రమాలు చేసి నియోజకవర్గాన్ని సాధిస్తామని తెలిపినారు.

## మహిళల్లో దేశభక్తి జ్యోతి రగిల్చిన దురేందర్ 2 ప్రదర్శన



- బీబీ పాటిల్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేక సినిమా షో....

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో ఆత్మనిర్భర్ మహిళా యోజన జహీరాబాద్ నిర్వాహకులు, విశ్వ మాంగళ్య మహాసభ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ హాస్పి పూర్ణిమ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 160 మంది మహిళలు కలిసి "దురేందర్ 2" సినిమా వీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో దేశభక్తి భావాలు పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సినిమా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ, మనం ఈరోజు సుఖసంతోషాలతో జీవించడానికి వారి పోరాటమే కారణమని మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు తమలో దేశభక్తి పట్ల మరింత ఆసక్తిని పెంచుతున్నాయని, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. మాకు ఈ అవకాశం కల్పించిన మాజీ ఎంపీ బీబీ పాటిల్ కి మహిళలు మరియు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో దేశం పట్ల ప్రేమ, బాధ్యతాభావం మరింత పెంపొందించాలనే ఉద్దేశం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు, స్థానిక నాయకులు మరియు నిర్వాహకులు పాల్గొన్నారు

## మహనీయుల విగ్రహాలనుసగర్వంగా ఆవిష్కరించుకుందాం...!



- తిమ్మాపూర్ జేఏసి నేతలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి.

**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 10:**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ముందు గత 4 ఏళ్ళ క్రితం నెలకొల్పిన బాబు జగ్జీవన్ రాం, డా.అంబేద్కర్ విగ్రహాల ముసుగులు తొలగించి ఆవిష్కరించేందుకు ప్రభుత్వ పరమైన అనుమతులు వచ్చాయని, త్వరిత గతిన మిగతా పనులు పూర్తి చేసి సగర్వంగా, ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమం చేసుకుందామని మానకొండూర్ ఎమ్మెల్యే, పిసిసి ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తిమ్మాపూర్ మండల రాజకీయ, ప్రజాసంఘాల జేఏసి నేతలతో పేర్కొన్నారు. సాంకేతిక కారణాలతో ఆవిష్కరణకు నోచుకోకుండా ముసుగులతో ఉన్న మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు అనుమతులు లభించినందుకు తిమ్మాపూర్ మండల రాజకీయ, ప్రజాసంఘాల జేఏసి పక్షాన శుక్రవారం ఏమ్మెల్యే ను క్యాంప్ కార్యాలయంలో కలిసి ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయుల విగ్రహాల సుందరీకరణ,ఆవిష్కరణ కార్యక్రమాలకు ప్రభుత్వం ద్వారా సుమారు 50 లక్షల నిధులను మంజూరు చేయించి అట్టి స్థలాన్ని సుందరంగా నిర్మింకుందామని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు జేఏసి సభ్యులు తెలిపారు.విగ్రహాల ఆవిష్కరణ అనుమతుల విషయం లో ఆర్టిసి ఎండి నాగిరెడ్డి తో మాట్లాడగా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 14 న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి జయంతి వరకు సుందరీకరణ పనులు పూర్తి కావు కాబట్టి కొంత సమయం తీసుకొని పూర్తి స్థాయిలో పనులు చేసి మంత్రులను, ముఖ్య నాయకులను, గతంలో కృషి చేసిన వారిని పిలిపించుకొని పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించుకుందామని ఎమ్మెల్యే పేర్కొనట్లు జెఏసి సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్లు మాతంగి శంకర్, సుగుర్తి జగదీశ్వరాచారి, వంతడ్పుల సంపత్, దుండ్ర రాజయ్య, సముద్రాల లక్ష్మణ్,కనకం రాములు,మాజీ సర్పంచ్ లు బోయిని కొమురయ్య,మేడి అంజయ్య,మీసాల అంజయ్య,కవ్వంపల్లి పద్మ, మాతంగి లక్ష్మణ్,పోన్నాల సంపత్,నాయకులు కన్నం లక్ష్మన్,అలువాల కోటి,సంగుపట్ల మల్లేశం ,ఎంఆర్పిఎస్ అధ్యక్షులు అలువాల సంపత్, కొయ్యడ మురళి,రెడ్డిగాని రాజు,మామిడి అనిల్,మేకల సతీష్,కన్నం నర్సయ్య,సాగర్,లింగం కుమార్,దావ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు,



- మెరుగుదల వైద్య సేవల కోసం అవసరమైన సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

**వెలుతురు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 10:**

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, మెరుగుదల వైద్య సేవల కోసం అవసరమైన సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు.

గురువారం కూకట్ పల్లి, ఎల్లమ్మబండలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూరోజుకు ఎంత ఓపి ఉంటుందని, ఆసుపత్రిలోని మౌలిక వసతుల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సెంటర్ కు ఎంత మంది ఆశావర్కర్లు ఉన్నారని కలెక్టర్ అడుగగా, ఆశావర్కర్ల కొరత ఉందని మెడికల్ ఆఫీసర్ వివరించారు. ఆసుపత్రికి అదనపు గదులు, టాయిలెట్లు కావలసినవి కలెక్టరును కోరగా, అవసరమైన మరమ్మత్తులకు, నిర్మాణాలకు అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిని పరిశీలించి లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు.

ఫార్మసిస్ట్కు ఔషధాల నిల్వలను సమర్థంగా నిర్వహిస్తూ, ఎమర్జెన్సీ కార్నర్ను సక్రమంగా ఉంచాలని సూచించారు. పేషంట్లకు మందులు అందించేటప్పుడు ఎక్స్పైరీ డేట్ చెక్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రిజిష్టర్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్, ఇమ్యునైజేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం అవసరమైన నిధులను సమకూర్చుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిపై మున్సిపల్ చైర్మన్ ఆకస్మిక తనిఖీ

- *వైద్య సేవల్లో నిర్లక్ష్యంపై ఆగ్రహం, మెరుగుదలకు కఠిన ఆదేశాలు...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిపై మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనూస్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ల బృందంతో కలిసి ఆసుపత్రిని సందర్శించిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమగ్రంగా పరిశీలించారు.

తనిఖీ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులను చైర్మన్ పరిశీలిస్తూ, చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వైద్యులు సమయానికి అందుబాటులో ఉన్నారా? నర్సింగ్ సిబ్బంది సేవలు ఎలా ఉన్నాయి? మందులు సమృద్ధిగా అందుతున్నాయా? వంటి కీలక అంశాలపై రోగులను ప్రశ్నించారు. కొంతమంది రోగులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను చైర్మన్ దృష్టికి తీసుకురాగా, వాటిపై వెంటనే స్పందిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా ఆసుపత్రిలోని పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, బెడ్ల లభ్యత, అత్యవసర సేవల పనితీరు వంటి అంశాలను కూడా సమీక్షించారు. కొన్ని విభాగాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించిన చైర్మన్, సంబంధిత అధికారులకు వెంటనే వాటిని సరిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనూస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులు పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆధారంగా నిలుస్తాయని, అలాంటి ఆసుపత్రుల్లో నిర్లక్ష్యం అస్సలు సహించబోదని స్పష్టం చేశారు. ప్రతి రోగికి సమయానికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇదిలా ఉండగా, తనిఖీ సమయంలో ఒక వైద్యుడు విధులకు గైర్హాజరు కావడం గమనించిన చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ వివరణ ఇవ్వగా, సంబంధిత వైద్యునికి మెమో జారీ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి వార్డులో వైద్య బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని చైర్మన్ ఆదేశించారు. ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు మున్సిపాలిటీ పూర్తి స్థాయిలో సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జమీల్, జాంగిర్, అక్రం, మహేష్ చౌహాన్ వకీల్, జావిద్, నిజామ్, ఇర్మియా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## జీర్లపల్లి, కురుసంగంలో భూమి సుపోషణపై అవగాహన

- మట్టి పరీక్షల ప్రాముఖ్యత వివరించిన నిపుణులు....

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝురాసంగం మండలంలోని జీర్లపల్లి, కురుసంగం గ్రామాల్లో డి.డి.యస్-కేవీకే ఆధ్వర్యంలో భూమి సుపోషణ మరియు సంరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతులు, మహిళా రైతులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా డి.డి.యస్-కేవీకే భూసార పరీక్ష నిపుణులు ఈ. స్వామి మాట్లాడుతూ, మట్టి పరీక్షలు వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పొలాల నుండి మట్టి నమూనాలను సరిగా ఎలా సేకరించాలి, ఎప్పుడు సేకరించాలి అనే అంశాలపై రైతులకు ప్రాయోగికంగా వివరించారు. మట్టి పరీక్షల ద్వారా భూమిలోని పోషక విలువలు, పిహెచ్ స్థాయి, నీటిలో కరిగే లవణాల శాతం, సేంద్రియ కార్బన్ స్థాయిలు వంటి కీలక అంశాలను తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ వివరాల ఆధారంగా సరైన పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అనంతరం శాస్త్రవేత్త (పంటల యాజమాన్యం) వి. రమేష్ మాట్లాడుతూ, రైతులు మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. దీని ద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గి ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ప్రతి సంవత్సరం ఒకే పంటను సాగు చేయకుండా పంట మార్పిడి విధానం పాటించాలని, అంతర పంటలు సాగు చేయడం ద్వారా భూమిలో పోషకాల సమతుల్యత కాపాడుతూ దిగుబడులు పెంచుకోవచ్చని వివరించారు. అలాగే సేంద్రియ ఎరువులు అయిన వర్మికంపోస్ట్, ఘనజీవామృతం తయారీ మరియు వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఇవి భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, డి.డి.యస్ సూపర్వైజర్ సంపత్, నర్సిములు, మహిళా రైతులు మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో కార్మికుడు అదృశ్యం

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఫయాజ్ నగర్కు చెందిన 36 ఏళ్ల కార్మికుడు అష్ఫాక్ అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ మేరకు ఆయన భార్య జుబేద బేగం జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, అష్ఫాక్ ఈ నెల 1వ తేదీ ఉదయం సుమారు 10 గంటల సమయంలో పని కోసం వెళ్తున్నట్లు ఇంటి నుండి బయలుదేరి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు మరియు పరిచయస్తుల వద్ద విస్తృతంగా వెతికినప్పటికీ ఎక్కడా ఆయన ఆచూకీ లభించలేదని తెలిపారు. ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కె. వినయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అష్ఫాక్ ఆచూకీపై సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గం లోని మోతె గ్రామంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

- కొరకు 25 ఎకరాల స్థలంలో నిర్మాణానికి శంకుస్థాపన

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 10**



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం లింగంపేట మండలం మోతె గ్రామం లో 200 కోట్లతో ఇంటిగ్రెటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కొరకు 25 ఎకరాలలో నిర్మించతలపెట్టిన నిర్మాణనికి శంకస్థాపన చేసిన జహిరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శట్కార్, MLC అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎల్లారెడ్డి శాసన సభ్యులు మదన్ మోహన్, ప్రజా ప్రతినిధులు

ఎల్లారెడ్డి నియోజకవర్గం లింగంపేట మండలం మోతె గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్, ఎంఎల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా SP రాజేష్ చంద్ర, ఎల్లారెడ్డి శాసన సభ్యులు మదన్ మోహన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల విద్యార్థులు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ఈ పాఠశాలలో 5వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఒకే చోట చదువుకునే సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు.

అంతేకాకుండా, విద్యార్థులకు ఆధునిక తరగతి గదులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, క్యాంటీన్ సౌకర్యం, వసతి గృహాలు వంటి అన్ని సదుపాయాలతో ఈ విద్యాసంస్థను నిర్మిస్తున్నామని వివరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత ప్రాంతీయ విద్యా అభివృద్ధికి ఇది కీలకంగా మారుతుందని అన్నారు.

## జహీరాబాద్‌లోని హుగ్గెల్లిలో 60 ఏళ్ల వృద్ధుడు అదృశ్యం

- వివరాలు వెల్లడించిన రూరల్ ఎస్ఐ కాశీ నాథ్....

**జహీరాబాద్, వెలుతురు ఏప్రిల్ 10:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు బొడ్డు దశరథ్ అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. ఈ మేరకు ఆయన కుమారుడు బొడ్డు శివరాజ్ జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, బొడ్డు దశరథ్ ఈ నెల 5వ తేదీ ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు మరియు పరిచయస్తుల వద్ద విస్తృతంగా వెతికినప్పటికీ ఎక్కడా ఆయన ఆచూకీ లభించలేదని తెలిపారు. చివరకు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు మేరకు జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. కాశీనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన దశరథ్ ఎత్తు సుమారు 5 అడుగులు 6 అంగుళాలు, చామనచాయ వర్ణం కలిగి ఉండగా, ఇంటి నుండి బయటకు వెళ్లినప్పుడు నీలం రంగు లుంగీ, తెలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వృద్ధుడి ఆచూకీపై ఏవైనా సమాచారం తెలిసిన వారు వెంటనే జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని ఎస్ఐ కాశీ నాథ్ విజ్ఞప్తి చేశారు. సంబంధిత సమాచారాన్ని 8712661847, 8712656764, 8712656731 నంబర్లకు అందించవచ్చని వారు తెలిపారు.

## ఘనంగా శ్రీ యజ్ఞ వరాహ స్వామి హిందూ సమ్మేళనం...

**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 10:**



కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీ, గాయత్రి నగర్ బస్తి ల హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. శ్రీ యజ్ఞ వరాహస్వామి హిందూ సమ్మేళనం పేరిట నిర్వహించిన ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులు, వక్తలుగా సి ఎ చోళ్ళేటిరమేష్( అధ్యక్షులు) ,అన్నదానం సుబ్రహ్మణ్యం ,శ్రీ శ్రీ శ్రీ ఆత్మరాం సురేష్ మహారాజ్ , డాక్టర్ నీలిమ జిల్లా సంఘ్ చాలాక్ నిరంజనచారి లు హాజరై మాట్లాడారు. సమాజంలో కులాల పేరుతో విభజన పెరుగుతున్న నేపథ్యంలో హిందువులు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. విదేశీ ప్రభావాలను ఎదుర్కొనేందుకు సమాజంలో ఐక్యత అత్యంత అవసరమని , అదిశగా హిందువులంతా ఐక్యమత్యంతో ఉండాలన్నారు. హిందూ సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాన్ని నిర్వహించడంఅభినందనీయమన్నారు. ఈ సమ్మేళనంలో హౌసింగ్ బోర్డ్, గాయత్రి నగర్ ప్రజలు, విద్యార్ధి విద్యార్థులు 720 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

- నైట్ పెట్రోలింగ్ ముమ్మరం.అప్రమత్తతే నేరాల నివారణకు ఆయుధం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 10**

కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర శుక్రవారం నాడు కామారెడ్డి జిల్లా బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది హాజరు (రోల్ కాల్), వారి క్రమశిక్షణ మరియు సమయపాలనను స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తాను చెబుతున్న సూచనలు సిబ్బందికి ఏ మేరకు అర్థమయ్యాయో కూడా స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులు మరియు ఫిర్యాదుదారుల పట్ల మానవీయ కోణంలో గౌరవంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని త్వరితగతిన పరిష్కరించడం ద్వారా పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాలని ఎస్పీ కోరారు. ప్రజల ఫిర్యాదుల పట్ల వేగంగా స్పందించి పరిష్కార దిశగా పనిచేయాలని స్పష్టం చేశారు.

చివరగా, జిల్లాలో ఇటీవల జరుగుతున్న ఆస్తి సంబంధిత నేరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయాల్లో నిరంతర పెట్రోలింగ్, గస్తీ పెంచాలని, అనుమానితులపై నిశిత నిఘా ఉంచాలని బాన్సువాడ ఎస్.హెచ్.ఓ ని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడరాదని, ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో బాన్సువాడ డిఎస్పి విఠల్ రెడ్డి, ఎస్.హెచ్.ఓ శ్రీధర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పింక్ మూన్ ముచ్చట్లు

సాధారణంగా చంద్రుడు తెల్లగా మిలమిల మెరిసిపోతుంటాడు. రాత్రి వేళ తెల్లని వెన్నెల వెలుతురు చాలా మందికి నచ్చుతుంది. అయితే అదే చంద్రుడు గులాబీ రంగులో కనిపిస్తే ఇంకెంత అందంగా ఉంటుందో కదా. పూర్తి పింక్ కలర్ లో కనిపించి అలరిస్తే చూడాలని చాలా మందికి ఉంటుంది. అసలు పింక్ మూన్ అంటే ఏంటి.. నిజంగానే చంద్రుడు గులాబీ రంగులో కనిపిస్తాడా.. ఇప్పుడు తెలుసుకుందాం.



### చంద్రుడు పింక్ కలర్ లో కనిపిస్తాడా..?

అయితే నిజానికి చంద్రుడు పింక్ కలర్ లో కనిపిస్తాడా అంటే కచ్చితంగా చెప్పలేము. వసంత కాలంలో వచ్చే తొలి పౌర్ణమి కావడంతో సహజంగా పింక్ మూన్ అని పేరు వచ్చింది. అయితే సాధారణ రోజుల్లో కంటే చంద్రుడు కాస్త చిన్నగా.. కొత్త తరహా రంగులో మాత్రం కనిపిస్తాడని ఖగోళ నిపుణులు చెబుతున్నారు. కాలమానాల్లో వ్యత్యాసాల దృష్ట్యా.. తొలిగా అమెరికాలో ఈ పింక్ మూన్ ను చూడవచ్చు. భారత్‌లో ఈ సంవత్సరం పింక్ మూన్ ఏప్రిల్ 13, ఆదివారం రోజు వచ్చింది. తెల్లవారుజామున 5:00 గంటల సమయంలో చూడొచ్చు. దీన్ని చూసేందుకు ప్రత్యేకమైన టెలిస్కోప్ లాంటివి అవసరం అవుతోంది. 1930లలో ఓల్డ్ ఫార్మర్స్ అల్మానాక్ అనే పత్రిక పౌర్ణములకి పేర్లు పెట్టడం మొదలుపెట్టింది. అందులో ఏప్రిల్‌లో వచ్చే పౌర్ణమిని పింక్ మూన్ అని పిలిచారు. అమెరికాలోని తూర్పు ప్రాంతాల ఆదివాసులు వసంతంలో పుష్పించే "హెర్బ్ మోస్ పింక్" అనే పువ్వు పేరు మీద ఈ పేరు పెట్టారని చెబుతారు. పౌర్ణమికి కేవలం పింక్ మూన్‌నే కాదు.. ఇతర పేర్లు కూడా వాడుకలో ఉన్నాయి. అంతే కాకుండా ఈ పౌర్ణమిని అట్లాంటిక్ తీరం వెంబడి షాడ్ చేపలు పుట్టడం ప్రారంభిస్తారు. కాలాన్ని గుర్తించడానికి తీరప్రాంత తెగలు చంద్రుడిని కాలానుగుణంగా పలు పేర్లతో పిలుస్తారు.

### భారత్, శ్రీలంకలో పింక్ మూన్ విశిష్టత

మన దేశంలో పింక్ మూన్‌ను హనుమంతుని పవిత్రమైన జన్మదిన వేడుకతో ముడిపెట్టి చూస్తారు. శ్రీలంక ప్రజలు 'బక్ పోయా' పండుగతో ఈ ఫుల్‌మూన్‌కు సంబంధం ఉందని భావిస్తుంటారు. ఈ సంపూర్ణ చంద్రగ్రహణం రోజునే బుద్ధుడు శ్రీలంకను సందర్శించి తమ దేశంలో అంతర్యుద్ధాన్ని ఆపారని శ్రీలంకలోని బౌద్ధులు విశ్వసిస్తారు.

### పింక్ మూన్ అంటే ఏంటి?

ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో వచ్చే మొదటి పౌర్ణమిని.. మైక్రో మూన్ గా పిలుస్తుంటారు. ఇది వసంతకాలం ప్రారంభాన్ని సూచిస్తుంది. దీనికి గుర్తుగా ఏడాదిలో వచ్చే తొలి పౌర్ణమిని పింక్ మూన్ గా పిలుస్తారు. వసంతకాలంలో వికసించే పువ్వు అని అర్థం వచ్చేలా పింక్ మూన్ అనే పేరు పెట్టారు. దీన్ని "మైక్రో మూన్" అని కూడా పిలుస్తారు, ఎందుకంటే ఈ సమయంలో చంద్రుడు భూమికి కొంచెం దూరంగా ఉంటాడు కాబట్టి కొద్దిగా చిన్నగా కనిపిస్తాడు. ఈ నేపథ్యంలో ఒక్కో దేశంలో అవి ఉన్న అక్షాంశ, రేఖాంశ స్థానాల దృష్ట్యా చంద్రుడు విభిన్నంగా కనిపిస్తాడని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.







మహాభారతం కాలం నాటిదే పానీపూరి..!

# ఇది మీకు తెలుసా..?

పానీపూరి.. ఈ పేరు వినగానే నోటిలో నీళ్లు ఊరుతాయి. పాఠశాల నుంచి ఇంటికెళ్తూనో లేదంటే కళాశాల నుంచి తిరిగొస్తూనో పానీపూరీ బండి దగ్గర ఆగిపోవడం సర్వసాధారణం. ఇద్దరు స్నేహితులు కలిసినా, ఫ్యామిలీతో సరదాగా బయటకెళ్లినా ఎక్కువగా ఆకర్షించేది పానీపూరీ వంటకమే. ఇది ఒక ప్రసిద్ధ స్ట్రీట్ ఫుడ్. నీరు, బంగాళదుంపలతో నింపిన పానీపూరీ చాలా రుచిగా ఉంటుంది. దేశంలోనే కాకుండా విదేశాలకు చెందిన వారు భారతదేశంలో పానీపూరిని ఆస్వాదిస్తారు. కానీ ఇది ఎక్కడ నుంచి వచ్చింది.. ఎప్పుడు ప్రారంభించారు అనేది చాలా మందికి తెలియదు. నిజానికి పానీపూరి గురించి చారిత్రక, పౌరాణిక కథనాలు ఉన్నాయి. పానీపూరి చరిత్రని వివరంగా తెలుసుకుందాం.

అయితే భారతదేశంలో పానీ పూరీని వివిధ పేర్లతో పిలుస్తుంటారు. చాలామంది 'గోల్‌గప్పా'గా పిలుస్తారు. అయితే ఇలా పిలవడం వెనక ఒక కారణం ఉంది. చాలామంది గోల్గప్పగా పిలిచే పానీ పూరీకి చాలా ఆసక్తికరమైన, ఆహ్లాదకరమైన అర్థం ఉంది. గోల్‌గప్పా అనే పదాన్ని రెండు భాగాలుగా విభజిస్తే.. 'గోల్' అనే పదం నీరు, బంగాళాదుంపలతో నిండిన పిండితో చేసిన కరకరలాడే ఆకారాన్ని సూచించగా, 'గప్ప' అనేది రెప్పపాటులో నోటిలో కరిగిపోయే ప్రక్రియను సూచిస్తుంది. అందుకే దీనిని గోల్‌గప్పా అని పిలుస్తుంటారు. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం.. పానీ పూరిగా ప్రసిద్ధి చెందింది.

అయితే పానీ పూరీని ఎవరు ఎలా కనుగొన్నారో చాలామందికి తెలియదు. ఒక పురాణం ప్రకారం.. ఇది మహాభారత కాలం నుంచే ఉందని ప్రచారం ఉంది. ద్రౌపది పానీపూరీని కనిపెట్టారు. ద్రౌపది ఐదుగురు పాండవులను వివాహం చేసుకుని ఇంటికి వచ్చినప్పుడు.. ఆమె అత్త కుంతి ఆమెకు ఒక పనిని అప్పగించింది. ఆ సమయంలో పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నందున.. వారు తక్కువ వనరులతో జీవితాన్ని గడపవలసి వచ్చింది. అందుచేత కుంతి.. తన కొత్త కోడలు అటువంటి పరిస్థితులలో జీవించగలదా? లేదా? అని చూడాలనుకుంది. ఈ క్రమంలోనే కుంతి ద్రౌపదికి కొన్ని మిగిలిపోయిన కూరగాయలు, పూరీ చేయడానికి సరిపడా గోధుమ పిండిని ఇచ్చి, అందరి కడుపు నింపే ఏదో ఒకటి చేయమని కోరింది. ద్రౌపది ఈ ప్రవర్తనకు చాలా ఆశ్చర్యపోయింది. ఈ క్రమంలోనే ఎవరూ ఊహించని వంటకాన్ని కనిపెట్టింది. నీళ్ళు, మసాలా నింపి కొన్ని చిన్న పూరీలు సిద్ధం చేసింది. ఈ కొత్త ఆవిష్కరణ అందరికీ నచ్చింది. అందువలన పానీ పూరీ మొదట మగధలో ఉద్భవించిందని నమ్ముతారు. అయితే ఈ కథ చాలా ఆసక్తితో కూడుకున్నది.అయితే ఇది నిజమని చెప్పడానికి పూర్తిస్థాయి ఆధారాలు అయితే లేవు.





### జాగ్రత్తలు పాటించాలి

అయితే ..ఈ పానీపూరి తినే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం కూడా అవసరమే.. పానీపూరి అనగానే పరిగెత్తుకుంటూ వెళ్లి ఆరగించడమే కాదు. ఆ పరిసరాలు శుభ్రంగా ఉన్నాయా లేదా చూడాలి. మన అభిరుచిని ఆసరాగా తీసుకుని వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. రసం చిక్కగా రావడానికి, ఆకర్షించే రంగు, రుచి కలిగించేందుకు విషపూరిత రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇక పానీపూరీ విక్రయించే ప్రాంతాలు సైతం పారిశుధ్య రహితంగా ఉంటున్నాయి. మురుగు కాల్వల పక్కన, వ్యర్థాలకు దగ్గర్లో బండ్లు పెట్టి అమ్ముతున్నారు. వర్షా కాలంలో నీటి కాలుష్యానికి ఆస్కారమెక్కువ. పానీపూరి విక్రేతలు పరిశుభ్రత పాటించడంపై ఎన్నో అనుమానాలు. అనారోగ్యం కొని తెచ్చుకోకుండా రుచితో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉంది.



# పెట్రోల్ బంకుల్లో ఉచిత సేవల గురించి తెలుసా..?

పెట్రోల్ బంక్.. ఇదంటే తెలియని వారే ఉండరు. మనలో చాలామంది తరచూ వాహనాల్లో పెట్రోల్, డీజిల్ కొట్టించుకునేందుకు పెట్రోల్ బంకులకు వెళ్తుంటాం. అయితే, పెట్రోల్ బంకుల్లో కేవలం పెట్రోల్, డీజిల్ మాత్రమే కాదు.. వినియోగదారులకు చాలా సేవలు అందుబాటులో ఉంటాయి. కానీ వాటి గురించి అవగాహన లేకపోవటంతో యాజమాన్యాలు కూడా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నాయి. బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొట్టించినా, లేకపోయినా ఈ సౌకర్యాలు వినియోగించుకోవచ్చు. మరీ ఆ సౌకర్యాలేంటో..? తెలుసుకుందాం.



**వాష్ రూమ్స్**
పెట్రోల్ బంకుల్లో ప్రజలకు వాష్‌రూమ్ సౌకర్యాలు ఉచితంగా లభిస్తాయి. ఎవరైనా ఈ వాష్‌రూమ్‌ని ఉపయోగించవచ్చు. దీని కోసం ఎవరైనా డబ్బులు అడిగితే షిఫ్ట్ మేనేజర్‌కి నివేదించవచ్చు.

**వాహనాలకు ఉచిత గాలి**
కారు లేదా బైక్ టైర్లలో పెట్రోల్ బంకులో ఉచితంగా గాలి నింపుకోవచ్చు. ఇందుకోసం పెట్రోల్ బంకులో ఎలక్ట్రానిక్ ఇన్‌ఫ్లేటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఒక ఉద్యోగిని నియమిస్తారు. కానీ మీరు నైట్రోజన్ గాలితో నింపాలనుకుంటే, మీరు దాని కోసం కొంత డబ్బు చెల్లించాలి. అయితే కొన్ని బంకుల్లో ఈ సదుపాయం కూడా ఉచితం.



**ఫోన్ సౌకర్యం**
అత్యవసర పరిస్థితుల్లో పెట్రోల్ స్టేషన్ నుండి ఉచిత కాల్ చేయవచ్చు. బంక్ యజమాని ఈ సౌకర్యం కల్పించాలి.

**నాణ్యత ప్రమాణాల తనిఖీ**
బంకులోని పెట్రోల్, డీజిల్ నాణ్యతపై అనుమానం కలిగితే అక్కడే చెక్ చేసుకోవచ్చు. ఇందుకు కావాల్సిన పరికరాలు, ఫిల్టర్ కాగితాలు కూడా బంకు సిబ్బందే ఇవ్వాలి. దీనితో పాటు పెట్రోల్, డీజిల్ తక్కువ పరిమాణంలో

### తాగునీరు
దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు చాలా ప్రాంతాల్లో నీటి సౌకర్యం లభించదు. పెట్రోల్ బంకుల్లో తాగునీరు ఉచితంగా లభిస్తుంది. దీని కోసం వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ నీటిని ఉచితంగా తాగవచ్చు.




### ఫిర్యాదు బాక్స్
పెట్రోల్ బంకుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చు. అందుకోసం ఫిర్యాదు బాక్స్ అందుబాటులో ఉంచాలి. వినియోగదారులు ఫిర్యాదు, సలహాలు, సూచనలు రాసి ఆ పెట్టెలో వేయొచ్చు. పెట్రోల్ పంప్ ఓనర్లు ఈ సేవలను ఉచితంగా అందించడం తప్పనిసరి. కాబట్టి ఎప్పుడైనా పెట్రోల్ పంప్‌కు వెళ్లినప్పుడు ఈ సౌకర్యాలను ఫ్రీగా ఉపయోగించుకోండి

### ప్రథమ చికిత్స కిట్
వాహనంలో ఇంధనం నింపుతున్నప్పుడు వాహనంలో మంటలు చెలరేగితే, బంక్‌లోని అగ్నిమాపక యంత్రాన్ని ఉపయోగించవచ్చు. ఈ వస్తువు కోసం ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రతి పెట్రోల్ బంక్‌లో ప్రథమ చికిత్స కిట్ సౌకర్యం ఉంటుంది. ఈ సదుపాయాన్ని ఎప్పుడైనా పొందవచ్చు. ఇందులో అవసరమైన మందులు, బ్యాండేజీలు ఉంటాయి. కానీ దానిని ఉపయోగించే ముందు, దాని గడువు తేదీ దాటిపోలేదని తనిఖీ చేయడం




# చికెన్ పాక్స్ లక్షణాలు చికిత్స ఇదే..



వేసవి కాలం మొదలైందంటే చాలా రకాల అనారోగ్య సమస్యలు చుట్టు ముడతాయి. వాటిల్లో ఒకటి చికెన్ పాక్స్. దీన్నే అమ్మవారు అని కూడా పిలుస్తారు. ఒళ్లంతా ఎర్రని దద్దుర్లు వచ్చి నీరసంగా ఉంటుంది. ఈ చికెన్ పాక్స్ అనేది వరిసెల్లా జోస్టర్ వైరస్ ద్వారా వ్యాపిస్తుందని వైద్య నిపుణులు తెలిపారు. ఈ వైరస్ అనేది వేడి వాతావరణంలోనే ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. చికెన్ పాక్స్ అనేది అంటు వ్యాధి. ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి ఈజీగా సోకుతుంది. గాలి ద్వారా ఎక్కువగా ఎటాక్ చేస్తుంది. కాబట్టి ఈ వైరస్ సోకిన వ్యక్తుల్ని సపరేటుగా ఉంచాలి.

### చికెన్ పాక్స్ లక్షణాలు
చికెన్‌పాక్స్ ప్రాణాంతక వ్యాధి కాదు. అయినప్పటికీ ఇది సంక్లిష్టతలను కలిగిస్తుంది. చికెన్‌పాక్స్ అనేది పిల్లలలో అత్యంత సాధారణ సంక్రమణం. అయితే ఇది పెద్దలలో చాలా ఇబ్బందులను కలిగిస్తోంది. తీవ్రమైన సందర్భాల్లో, బొబ్బలు నోరు, ముక్కు, కళ్ళు, జననేంద్రియాలకు విస్తరించవచ్చు. ఈ వైరస్ సోకితే ఒళ్లంతా నొప్పులగా ఉంటాయి. ఒక్కొక్కరికి జ్వరం, తలనొప్పి, వాంతింగ్ కూడా వస్తాయి. ఆకలి కూడా ఎక్కువగా అనిపిస్తుంది.

**ఇలా చేయకూడదు**
చికెన్‌పాక్స్‌తో బాధపడుతున్నప్పుడు, పొక్కులను తాకడం, గిల్లడం లేదా గోకడం వంటివి చేయకూడదు. దానివల్ల శరీరంలోని ఇతర భాగాలకు కూడా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. యాంటీవైరల్ మందులు, లోషన్లు చికెన్‌పాక్స్ నుండి కోలుకోవడానికి సహాయపడవచ్చు. డాక్టర్ రోగి పరిస్థితి, లక్షణాలు, వయస్సు, ఇన్ఫెక్షన్ పరిధి, చికిత్స సమయాన్ని బట్టి యాంటీ వైరల్ మందులను సూచించవచ్చు.

**చికెన్ పాక్స్‌కు చికిత్స**
గ్రామాల్లో ఇప్పటికీ కొన్ని మూఢ నమ్మకాలు పోలేదు. చికెన్ పాక్స్‌ని అమ్మవారిగా భావిస్తారు. దీంతో వైద్య చికిత్స అందించరు. చికెన్ పాక్స్ వచ్చిన వ్యక్తిని సపరేటు గదిలో ఉంచాలి. శుభ్రమైన గాలి, వెలుతురు తగిలే విధంగా చూడాలి. పౌష్టికమైన ఆహారం అందించాలి. తుమ్ము, దగ్గు వచ్చినప్పుడు నోరు, ముక్కు మూసుకోవాలి. ఇది గాలి ద్వారా ఇతరులకు సోకుతుంది కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలి. స్వీయ చికిత్సలు తీసుకోవడం మానేసి వైద్యుల సలహాలు పాటించాలి.

**చికెన్ పాక్స్ డైట్**
రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ,వేగంగా కోలుకోవడాన్ని ప్రోత్సహించడానికి పోషకమైన ఆహారం కీలకం. సరైన ఆహారాలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, మంటను తగ్గించడానికి వైద్యం కోసం అవసరమైన పోషకాలను అందించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా ఏమి తిందామన్న మింగడంలో ఇబ్బందిని కలిగిస్తుంది. తద్వారా పోషకాహారం మాత్రమే కాకుండా సులభంగా తినగలిగే ఆహారాన్ని ఎంచుకోవడం అవసరం.

**హైడ్రేషన్ కీలకం**
చికెన్‌పాక్స్‌ను నిర్వహించడంలో అత్యంత కీలకమైన అంశాలలో ఒకటి హైడ్రేటెడ్‌గా ఉండటం. జ్వరం, చెమటలు నిర్జలీకరణానికి దారితీయవచ్చు. ఇది లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది. రికవరీని నెమ్మదిస్తుంది. నీరు, హెర్బల్ టీలు, క్లియర్ బ్రోత్‌లు వంటి ద్రవాలను పుష్కలంగా తాగడం వల్ల శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడానికి టాక్సిన్‌స్‌ను బయటకు పంపడానికి సహాయపడుతుంది. క్రమం తప్పకుండా నీరు త్రాగాలి. కొబ్బరి నీరు వంటి ఎలక్ట్రోలైట్ అధికంగా ఉండే పానీయాలను ఎంచుకోవాలి. చక్కెర పానీయాలు , కెఫిన్‌లను నివారించండి. ఎందుకంటే అవి నిర్జలీకరణానికి దారితీస్తాయి. వైరస్‌ను బయటకు పంపడానికి వదులుగా ఉన్న బట్టలు ధరించాలి, చల్లని నీటితో స్నానం చేయాలి





## నా తండ్రి అలా చేయడం వల్లే మగవాళ్లంటే
# అసహ్యం పెరిగింది..



బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ నోరా ఫతేహి ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని తన వ్యక్తిగత జీవితం గురించి సంచలన విషయాలను పంచుకున్నారు. తెరపై గ్లామరస్‌గా కనిపించే ఆమె జీవితం వెనుక ఎంతో మానసిక వేదన ఉందని ఈ ఇంటర్వ్యూ ద్వారా తెలిసింది. ముఖ్యంగా తన చిన్నతనంలో తండ్రి వదిలేసి వెళ్లడం తనపై ఎలాంటి ప్రభావం చూపిందో ఆమె ఎమోషనల్‌గా వివరించారు. చిన్నప్పుడు తాను షకీరా, జెన్నిఫర్ లోపెజ్ వంటి సెలబ్రిటీలను చూసి స్ఫూర్తి పొందేదాన్నని, కానీ ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే తన తల్లి అంతకంటే గొప్ప స్ఫూర్తి అని నోరా అన్నారు. "మా అమ్మ ఒక సింగిల్ మదర్. తమ్ముడిని, నన్ను పెంచడానికి ఆమె పడరాని పాట్లు పడింది. మమ్మల్ని ఉత్తమంగా పెంచడం కోసం ఆమె ఎన్నో ఉద్యోగాలు చేస్తూ కష్టపడింది. నిజమైన స్ఫూర్తి మన చుట్టూ ఉన్న వ్యక్తుల నుంచే వస్తుందని నాకు అర్థమైంది" అని చెప్పుకొచ్చారు. సింగిల్ మదర్ పెంచడం వల్ల పురుషులతో తన సంబంధాలు ఎలా ఉన్నాయని యాంకర్ అడిగిన ప్రశ్నకు నోరా స్పందిస్తూ.. "నాకు నా తండ్రితో సమస్యలు ఉన్నాయి" అని నిజాయితీగా ఒప్పుకున్నారు.తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న తర్వాత, తండ్రి చాలా కాలం పాటు కనిపించకుండా పోవడంతో పురుషుల పట్ల అసహ్యం పెంచుకున్నట్లు తెలిపారు. ఆడపిల్లలు అలాంటి వాతావరణంలో పెరిగినప్పుడు, పురుషులు మహిళలను చూసే విధానంపై వ్యతిరేకత ఏర్పడుతుందని ఆమె అన్నారు. తండ్రి తనను వదిలేసి వెళ్లడం వల్ల తనలో భయం పెరిగిపోయిందని నోరా వెల్లడించారు. "ఒకవేళ ఎవరితోనైనా రిలేషన్ వర్కవుట్ కాకపోతే, వారు నన్ను వదిలేసి వెళ్తారనే నిజాన్ని నేను త్వరగా జీర్ణించుకోలేను. బ్రేకప్ నుంచి బయటపడటం నాకు చాలా కష్టం. గతంలో నాకు సరిపడని వ్యక్తులతో ప్రేమలో ఉన్నప్పటికీ, వారు నన్ను వదిలేస్తారనే భయం వల్ల నేను రిలేషన్ నుంచి త్వరగా బయటకు రాలేకపోయాను. ఇదంతా నా తండ్రి వల్ల నాలో కలిగిన మానసిక వేదన. అది నా తప్పు కాదు, కానీ నాపై ప్రభావం పడింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను ఆ మానసిక సమస్యల నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్నట్లు నోరా స్పష్టం చేశారు.

## ఆ సినిమాలంటే పిచ్చి.. అవసరమైతే కోసేసుకుంటా..
# మాస్ స్టేట్‌మెంట్ ఇచ్చిన యంగ్ హీరో



ప్రస్తుతం మంచి జోష్‌తో కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న యువ నటుల్లో కిరణ్ అబ్బవరం ఒకరు. ఇప్పటివరకు నటుడిగా మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈయన, తాజాగా 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రాన్ని నిర్మిస్తూ నిర్మాతగా కూడా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 17న విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఇటీవల ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు కిరణ్ అబ్బవరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన నందమూరి బాలకృష్ణ నటించిన 'చెన్నకేశవ రెడ్డి' చిత్రంలోని గెటప్‌లో ఈవెంట్‌కు హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు .ఈ కార్యక్రమంలో మాట్లాడిన కిరణ్ అబ్బవరం, తనకు నందమూరి బాలకృష్ణ నటించిన 'చెన్నకేశవ రెడ్డి', 'సమరసింహా రెడ్డి', 'నరసింహ నాయుడు' సినిమాలు అంటే ఎంతో ఇష్టమని, వాటి కోసం కోసేసుకుంటా అని వ్యాఖ్యానించారు. అందుకే 'చెన్నకేశవ రెడ్డి' గెటప్‌లో ఈవెంట్‌కు వచ్చానని చెప్పారు. మొదట ఈ గెటప్‌కు సరిపోయే విధంగా మీసాలు కూడా పెట్టాలని అనుకున్నానని, అయితే మరుసటి రోజు షూటింగ్ ఉండటంతో అది సాధ్యపడలేదని ఆయన వెల్లడించారు. ఇలా నందమూరి బాలకృష్ణ సినిమాలపై తనకున్న అభిమానాన్ని ప్రత్యేకంగా వ్యక్తపరుస్తూ 'చెన్నకేశవ రెడ్డి' గెటప్‌లో ఈవెంట్‌కు హాజరైన కిరణ్ అబ్బవరంపై బాలయ్య అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇక 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## 'జననాయగన్' సినిమాకు లీకుల బెడద.. డైరెక్టర్ రియాక్షన్ ఇదే..



కోలీవుడ్ స్టార్ హీరో, రాజకీయ నాయకుడు దళపతి విజయ్ నటిస్తున్న చివరి చిత్రం 'జననాయగన్' చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. ఓ వైపు ఆయన ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండగా, మరోవైపు ఆయన చివరి సినిమాకు సంబంధించి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే సెన్సార్ సమస్యల వల్ల వాయిదా పడుతూ వస్తున్న ఈ చిత్రం నుంచి తాజాగా.. ఐదు నిమిషాల సీన్‌తో పాటు ఓ పాట లీక్ అవ్వడం ఇండస్ట్రీలో కలకలం రేపుతోంది. ఈ సినిమా నుంచి విజయ్ ఇంట్రడక్షన్ సీన్, టైటిల్ కార్డ్స్, దళపతి కచేరీ అనే పాటలో కొంత భాగం సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఏకంగా ఐదు నిమిషాల ఫుటేజీ బయటకు రావడంతో చిత్ర బృందం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. వెంటనే అలర్ట్ అయిన టీమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఈ లీక్ వెనుక ఎడిటింగ్ లేదా పోస్ట్ ప్రొడక్షన్ టీమ్ ప్రమేయం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఈక్రమంలో.. ఈ లీకులపై దర్శకుడు హెచ్ వినోద్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రతి సీన్ వెనుక ఎంతోమంది కళ, కష్టం, కలలు దాగి ఉంటాయి. సినిమా విడుదలకు ముందే ఇలా సీన్లు లీక్ అవ్వడం నిజంగా బాధాకరం. దయచేసి ఎవరూ వీటిని షేర్ చేయకండి, చిత్ర బృందానికి మద్దతుగా నిలవండి" అంటూ ఆయన అభిమానులను కోరారు. విజయ్ చివరి సినిమా కావడంతో ఫ్యాన్స్ కూడా ఈ లీకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ సరసన పూజా హెగ్డే, మమిత బైజు నటిస్తుండగా.. బాబీ డియోల్, ప్రియమణి, ప్రకాష్‌రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా వాస్తవానికి సంక్రాంతికే విడుదల కావాలి, కానీ సెన్సార్ (CBFC) అభ్యంతరాల వల్ల కోర్టు గడప తొక్కింది.

# ఇప్పుడే మొదలెట్టినట్లుంది!



"దక్షిణాది ప్రేక్షకులు నా పట్ల ఎప్పుడూ ఎంతో ప్రేమతో ఉంటున్నారు. నన్ను వాళ్ల కుటుంబంలోని వ్యక్తిలా ఆదరించారు. ఇది నాలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది" అంటోంది తమన్నా. ఓవైపు మహిళా ప్రాధాన్య చిత్రాలు, మరోవైపు ఓటీటీ కథలు.. ప్రత్యేక పాటలు.. ఇలా ఎదురొచ్చిన అవకాశాన్ని అందుకుంటూ అభిమానుల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుందీమె. ఈ మధ్యే సినీ రంగంలో 21ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా మాట్లాడుతూ.. "ప్రస్తుతం నేను నటించిన చిత్రాలన్నీ ఒక్కొక్కటిగా విడుదల కాబోతున్నందుకు ఉత్సాహంగా ఉన్నా. చాలా మంది నటీనటులకు.. ముఖ్యంగా నటీమణులకు ఇలాంటి అవకాశం లభించదు. నా కెరీర్ మొదలై దాదాపు 21ఏళ్లు అయ్యింది. అయినా ఇప్పుడే మళ్లీ ప్రారంభిస్తున్నట్లుగా ఉంది. దక్షిణాది పరిశ్రమలో లభిస్తున్న ఆదరణ నాకు మరింత ఉత్తేజాన్ని కలిగిస్తుంది. అందుకే నేను కూడా వారిని కొత్త కథలు, ప్రయోగాత్మక చిత్రాలతో అలరించాలని భావిస్తున్నాన"ని చెప్పుకొచ్చింది.

## మ్యాడక్ ఫిలింస్ డ్రీమ్ ప్రాజెక్ట్ నుంచి దీపికా ఔట్..
# ఆ భారీ సినిమాలో చాన్స్ కొట్టేసిన శ్రద్ధా కపూర్!

బాలీవుడ్ ముద్దుగుమ్మ శ్రద్ధా కపూర్ ఇప్పుడు ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. 'స్త్రీ' సినిమాతో మ్యాడక్ ఫిలింస్‌కు కాసుల వర్షం కురిపించిన ఈ బ్యూటీ, ఇప్పుడు అదే బ్యానర్‌లో రాబోతున్న అతిపెద్ద ప్రాజెక్ట్ 'మహావతార్' లో భాగం కాబోతున్నట్లు తెలుస్తోంది. పరశురాముడిగా నటిస్తున్న విక్కీ కౌశల్ సరసన శ్రద్ధా కపూర్ ఎంపిక దాదాపు ఖరారైనట్లేనని సమాచారం. నిజానికి ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం మొదట దీపికా పదుకొణె పేరు గట్టిగా వినిపించింది. కానీ, పరశురాముడి లాంటి పవర్‌ఫుల్ క్యారెక్టర్ పక్కన శ్రద్ధా కపూర్ ఉంటే ఆ క్రేజ్ వేరేలా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారట. పైగా మ్యాడక్ ఫిలింస్ కు శ్రద్ధా ఒక గోల్డెన్ లెగ్. ఆమె ఉంటే సినిమా హిట్టే అనే సెంటిమెంట్ కూడా ఉండటంతో, శ్రద్ధా వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. జూన్ తర్వాత షూటింగ్ మొదలయ్యే ఈ సినిమాలో శ్రద్ధా పాత్ర చాలా ఎమోషనల్‌గా, బలంగా ఉంటుందని సమాచారం. ఒకవేళ శ్రద్ధా ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, మ్యాడక్ ఫిలింస్ బ్యానర్‌లో ఆమెకు ఇది ఐదో సినిమా అవుతుంది. ప్రస్తుతం శ్రద్ధా రేంజ్ మాములుగా లేదు. ఒకవైపు 'స్త్రీ 3' పనుల్లో బిజీగా ఉంటూనే, మరోవైపు 'ఈత' అనే బయోపిక్ మూవీలో నటిస్తోంది. ఇప్పుడు 'మహావతార్' కూడా తోడవ్వడంతో అమ్మడు ఫుల్ బిజీ అయిపోయింది. దర్శకుడు అమర్ కౌశిక్ ఈ సినిమాను ఇండియన్ స్క్రీన్ పై మునుపెన్నడూ చూడని విధంగా మలిచేందుకు ప్లాన్ చేస్తున్నారు. పరశురాముడి జీవిత కథ ఆధారంగా వస్తున్న ఈ చిత్రం మైథలాజికల్ టచ్‌తో కూడిన భారీ యాక్షన్ డ్రామాగా ఉండబోతోందని తెలుస్తోంది. ఇక మ్యాడాక్ ఫిలింస్ డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రాబోతున్న ఈ సినిమాలో విక్కీ కౌశల్ శ్రద్ధా కపూర్ కాంబినేషన్ వెండితెరపై ఒక ఫ్రెష్ ఫీలింగ్‌ను ఇస్తుందని ఫ్యాన్స్ కూడా తెగ ఖుషీ అవుతున్నారు.






## అజిత్‌తో రైడ్.. ఎన్నో విషయాలు
# నేర్చుకున్నా

నటి మంజు వారియర్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన లద్దాఖ్ బైక్ ట్రిప్ విశేషాలను గుర్తు చేసుకున్నారు. అజిత్ కుమార్‌తో కలిసి 14 రోజుల పాటు సాగిన ఈ ప్రయాణం తనకు ఎన్నో విషయాలు నేర్పిందన్నారు. "అజిత్‌తో కలిసి చేసిన ఆ రైడ్ నా కళ్లు తెరిపించింది. లద్దాఖ్‌లో వాళ్ల టీమ్‌ను కలిశాను. సుమారు 14 రోజుల పాటు వారితో కలిసి ప్రయాణించాను. అజిత్ కుమార్ ఎన్నో విషయాలు నేర్పారు. ఒకవేళ మనకు ప్రమాదం జరిగితే, మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి అనేది మొదటిరోజే చెప్పారు. నాకు బైక్ నడపడం వచ్చు కానీ, అప్పట్లో నా దగ్గర లైసెన్స్ లేదు. వారంతా ప్రొఫెషనల్ రైడర్స్ కావడంతో వారితో కలిసి మేనేజ్ చేయడం నాకు కొత్తగా అనిపించింది. ఆ ట్రిప్ పూర్తయ్యాక నేను లైసెన్స్ తీసుకున్నాను" అని మంజు చెప్పారు.అజిత్‌కు సినిమాలు అంటే ఎంత ఇష్టమో మోటార్ రేసింగ్ కూడా అంతే ఇష్టం. ఎన్నోసార్లు రేసింగ్ పోటీల్లో పాల్గొన్నారు. 'అజిత్ కుమార్ రేసింగ్' పేరుతో టీమ్‌ను కూడా నిర్వహిస్తున్నారు. మంజు వారియర్, అజిత్ కలిసి 'తునివు' (తెలుగులో తెగింపు)లో నటించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వీరిద్దరూ కలిసి లద్ధాఖ్ ట్రిప్‌నకు వెళ్లారు.



## ఈ ఏడాది గొప్ప చిత్రాల్లో
# 'డెకాయిట్' ఒకటి



డివి శేష్ ప్రధాన పాత్రలో షానియల్ డియో దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డెకాయిట్'. భారీ అంచనాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకుంది. తాజాగా దీనిపై నటుడు నాని చిత్రబృందాన్ని అభినందిస్తూ పోస్ట్ పెట్టారు. 'డెకాయిట్' మనసును హత్తుకునే నిజమైన బ్లాక్‌బస్టర్ అని.. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ మిస్ కావద్దని నాని ప్రేక్షకులను కోరారు. ఈ సినిమాలో అడివి శేష్ నటన అద్భుతమని కొనియాడారు. ఇది అతని కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన అని అన్నారు. నటి మృణాల్ ఠాకూర్ తన పాత్రలో చాలా అందంగా ఒదిగిపోయారన్నారు. ఆమె ఖాతాలో మరో గొప్ప సినిమా చేరిందని ప్రశంసించారు. రచన, స్క్రీన్‌ప్లే విభాగం పనితీరును మెచ్చుకున్నారు. ఈ ఏడాదిలోని గొప్ప చిత్రాల్లో ఇదీ ఒకటిగా నిలిచిపోతుందని.. ఇలాంటి సినిమాను నిర్మించినందుకు సుప్రియను ప్రత్యేకంగా అభినందించారు. నాని పోస్ట్‌కు అడివి శేష్ రిప్లై ఇచ్చారు. ఈ రివ్యూ చూసిన తర్వాత తన హృదయం ఆనందంతో నిండిపోయిందన్నారు. 'డెకాయిట్' టీమ్ మరింత ఉత్సాహంగా ఉందన్నారు.



# ప్రజలకు చేరువగా పోలీసింగ్:

# సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్

సైబరాబాద్ వెలుతురు ఏప్రిల్ 10:

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో శుక్ర వారం నేర నియంత్రణపై సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులు, అన్ని పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో ప్రస్తుత నేరాల పరిస్థితిని సమీక్షించిన సీపీ, నేరాల నివారణకు తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.





ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్, ఫుట్ పెట్రోలింగ్ నిరంతరం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి, వారి సమస్యల పరిష్కారానికి 'ఎఫ్ఐఆర్ ఎట్ హోమ్' విధానంలో మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. ముఖ్యంగా రాబోయే బక్రీద్ వంటి పండుగల సమయాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు.

నేరాల నియంత్రణ, నేరాల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాలలో వీటిని విస్తృతంగా ఏర్పాటు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సెల్ ఫోన్ దొంగతనాలకు సంబంధించి 'CEIR' పోర్టల్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని, తద్వారా పోగొట్టుకున్న ఫోన్లను త్వరగా రికవరీ చేస్తున్నామన్నారు . ప్రతి స్టేషన్ హౌస్ ఆఫీసర్ తన పోలీసు స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిస్థితులపై పూర్తి పట్టు సాధించాలని, ఇతర రాష్ట్రాల పోలీస్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ నేర నియంత్రణ లో కలిసి పనిచేయాలని సూచించారు.

పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ఆందోళన వ్యక్తం చేసిన కమిషనర్, ప్రజలు డిజిటల్ మోసాల బారిన పడకుండా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, అతివేగం మరియు బైక్ రేసింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే పబ్‌లపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేయాలని, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్షలు పడేలా చూడాలని సీపీ ఆదేశించారు. ముఖ్యంగా మిస్సింగ్, కిడ్నాప్ కేసులలో త్వరగా ట్రేస్ అవుట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు పనిచేయాలన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ ఉన్నవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అవసరమైతే పీడీ (PD) యాక్ట్ ప్రయోగించాలని స్పష్టం చేశారు. ఎన్.డి.పి.ఎస్ (NDPS) కేసుల్లో డ్రగ్స్ రవాణా చేసే వారి పట్ల రాజీలేని వైఖరి అవలంబించాలని పేర్కొన్నారు.

స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని, దర్యాప్తులో వేగం పెంచి సకాలంలో ఛార్జ్ షీట్లు దాఖలు చేసేలా న్యాయాధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎస్ఓటీ, సీసీఎస్ (CCS) బృందాల పనితీరును సమీక్షించి, ఆస్తి సంబంధిత నేరాల రికవరీలో పురోగతి ఉండాలని ఆకాంక్షించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూనే, ప్రతిరోజూ ఉదయం రోల్ కాల్ సమయంలో ఉన్నతాధికారులు సిబ్బందికి తగిన సూచనలు చేస్తూ వారిలో నైతిక స్థైర్యాన్ని నింపాలని సీపీ సూచించారు.

అడ్మిన్ డిసిపి అన్నపూర్ణ మాట్లాడుతూ.. అధికారులు సీనియర్‌ల సూచనలు తీసుకుని పరస్పరం సహకరించుకుంటూ నేర నియంత్రణలో సమర్థంగా పని చేయాలని చెప్పారు. ఆల్ ఇండియా డ్యూటీ మీట్‌లో మెడల్స్ గెలిచిన వారికి సత్కారం చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. అలాగే భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని, నిర్మాణ ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు.

క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి మాట్లాడుతూ .. సైబర్ నేరాల పట్ల బాధితులు తక్షణమే స్పందించాలని, మొబైల్ ఫోన్ పోయినప్పుడు వెంటనే ఫిర్యాదు నమోదు చేసి బ్యాంక్ అధికారులకు సమాచారం అందించాలని క్రైమ్స్ డిసిపి సూచించారు. ముఖ్యంగా యూపీఐ (UPI) ట్రాన్సాక్షన్స్ నిలిపివేయడం ద్వారా తదుపరి ఆర్థిక నష్టాన్ని అరికట్టవచ్చని, ఈ ప్రక్రియలో పోలీసులు బాధితులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆదేశించారు. సాంకేతికతను ఆసరాగా చేసుకుని సాగుతున్న నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, ఫిర్యాదు అందిన వెంటనే బ్యాంక్ డేటాను విశ్లేషించి నిందితులను పట్టుకునేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పోలీస్ స్టేషన్లలో ఫైల్స్ ను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని డిసిపి పేర్కొన్నారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు (Abandoned Vehicles) మరియు ఇతర ఆస్తులకు సంబంధించి పత్రాలతో కూడిన ప్రత్యేక రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. వాహనాలను హ్యాండ్ ఓవర్ లేదా టేక్ ఓవర్ చేసే సమయంలో బాధ్యుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, స్టేషన్ ఆవరణలో ఉన్న వస్తువులకు పటిష్టమైన భద్రత కల్పించాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించడం ద్వారానే విభాగం పనితీరు మెరుగుపడుతుందని ఆయన స్పష్టం చేశారు.

కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటి రెడ్డి మాట్లాడుతూ.. నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పెంచడంపై దృష్టి సారించాలని, నిందితుల వేలిముద్రలు (Fingerprints) మరియు పాదముద్రల (Footprints) ఆధారంగా కేసులను ఛేదించేలా ప్రతి పోలీస్ స్టేషన్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో లభించే సాంకేతిక ఆధారాలను విశ్లేషించడం ద్వారా నిందితులను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా దేవాలయాలు, మసీదులు వంటి సున్నితమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటును విధిగా చేపట్టాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు ఈ కెమెరా ఫుటేజీలు నేరస్తులను పట్టుకోవడానికి మరియు కేసుల సత్వర పరిష్కారానికి కీలక సాక్ష్యాలుగా మారుతాయని ఆయన స్పష్టం చేశారు.

మతపరమైన పండుగల సందర్భంగా సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల్లో ఎటువంటి తప్పుడు సమాచారం (Rumors) వ్యాప్తి చెందకుండా గట్టి నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చూడాలని సూచించారు. ప్రజలు మరియు మత పెద్దలతో సమన్వయం చేసుకుంటూ, సున్నితమైన ప్రాంతాల్లో నిరంతరం పహారా నిర్వహించి పండుగలను ప్రశాంతంగా జరుపుకునేలా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.

శేరిలింగంపల్లి డీసీపీ సీ.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. మతపరమైన పండగల సందర్భంగా పోలీసులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కమ్యూనల్ సమస్యలకు దారితీసే సున్నితమైన అంశాలపై కఠినంగా, జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. శాంతిభద్రతలను కాపాడేందుకు అవసరమైన చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని ఆదేశించారు. అలాగే ఈ సందర్భం గా ఎదురయ్యే సమస్యల పరిష్కారంలో వెటర్నరీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని, వివిధ విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే సమర్థవంతమైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కూడా ఆయన స్పష్టం చేశారు.

కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ మాట్లాడుతూ.. సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా హాస్టల్ యజమానులు మరియు హోటల్ మేనేజ్‌మెంట్‌లతో నిరంతరం సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పెరుగుతున్న ద్విచక్ర వాహనాల దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాహనాల పార్కింగ్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దొంగతనాలను ఎలా నివారించవచ్చో ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా, ట్రాఫిక్ అంతరాయానికి కారణమవుతున్న అన్‌ఆథరైజ్డ్ పార్కింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడమే కాకుండా, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరించాలని చూసించారు.

నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 14 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు జీవనోపాధి పొందుతుండగా, హైదరాబాద్ ఆర్థికాభివృద్ధిలో భాగంగా నార్సింగి డివిజన్ పరిధిలోనే సుమారు 50 వేల మంది వలస కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్మికుల భద్రత మరియు సంక్షేమం పట్ల యజమానులు, కన్స్ట్రక్షన్ కంపెనీలు పూర్తి బాధ్యత వహించే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇటీవల లేబర్ క్యాంపుల్లో నమోదవుతున్న నేరాలు, ప్రమాదాలు మరియు అసాంఘిక కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని, సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. లేబర్ క్యాంపుల్లో పటిష్టమైన నిఘా, తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు మరియు విద్యుత్ దీపాల సదుపాయం కల్పించే విధం గా కృషి చేయాలని తెలిపారు.

ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పథకాలను ప్రతి కార్మికుడికి అందేలా చూడటం యజమానుల ప్రాథమిక విధి అని ఏసీపీ పేర్కొన్నారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు (B.O.C.W) ద్వారా నెలకు కేవలం ఒక రూపాయి చెల్లింపుతో ప్రమాదవశాత్తు మరణిస్తే ₹10 లక్షల భీమా, సహజ మరణానికి ₹2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. వీటితో పాటు వివాహ కానుక, ప్రసూతి సహాయం వంటి పథకాలను కార్మికులు పొందేలా ప్రతి ఒక్కరిని ఈఎస్ఐ (ESI), ఈపీఎఫ్ (EPF) మరియు బిఓసిడబ్ల్యూ (BOCW)లో నమోదు చేయాలన్నారు. లేబర్ క్యాంపుల్లో కనీస మౌలిక సదుపాయాలైన మంచినీరు, పారిశుద్ధ్యంతో పాటు పిల్లల సంరక్షణ కోసం 'బాలల సంరక్షణ కేంద్రాలను' తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై మరియు మత్తు పదార్థాలకు బానిసలయ్యే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని చూసించారు.

ఈ కార్యక్రమం లో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్., అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్., శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., ట్రాఫిక్ డీసీపీ II శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ట్రాఫిక్ డీసీపీ 1 రంజన్ రతన్ కుమార్ మరియు వివిధ పోలీసు అధికారులు పాల్గొన్నారు.




## సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట భారీ మోసం..రూ.5 కోట్లు బురిడీ..

- ఉద్యోగాల పేరుతో కోట్ల మోసం
- 452 మంది నుంచి భారీ వసూళ్లు
- నకిలీ కంపెనీలతో మళ్లీ మోసం ప్రయత్నం
- ముగ్గురు అరెస్ట్.. మరికొందరు పరార్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాలనే నిరుద్యోగుల ఆశను పెట్టుబడిగా మార్చుకున్న ఒక కేటుగాళ్ల ముఠా మాదాపూర్ కేంద్రంగా భారీ మోసానికి తెరలేపింది. 'Camel Q సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్' అనే సంస్థ పేరుతో రంగంలోకి దిగిన ఈ ముఠా, సుమారు 452 మంది అభ్యర్థుల నుంచి దాదాపు రూ. 5 కోట్ల వరకు వసూలు చేసింది. మాదాపూర్ పోలీసులు పక్కా నిఘా పెట్టి ఈ ముఠా గుట్టును రట్టు చేశారు.

మాదాపూర్ లోని అయ్యప్ప సొసైటీలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్న ఈ పది మంది సభ్యుల ముఠా, నిరుద్యోగులకు గాలం వేసింది. శిక్షణ , ప్లేస్‌మెంట్స్ ఇప్పిస్తామని నమ్మించి, ఒక్కొక్క అభ్యర్థి నుంచి వారి అవసరాన్ని బట్టి రూ. 80 వేల నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేశారు. అభ్యర్థులకు నమ్మకం కలిగించడం కోసం ప్రారంభంలో కొందరికి జీతాలు కూడా చెల్లించారు. ఆ తర్వాత అకస్మాత్తుగా బోర్డు తిప్పేసి పరారయ్యేవారు.

ఒక సంస్థపై నిఘా పెరుగుతోందని గమనించిన ఈ ముఠా, ఇటీవల 'MU సాఫ్ట్ టెక్ సొల్యూషన్స్' అనే మరో కొత్త పేరుతో సంస్థను ప్రారంభించి మళ్లీ మోసాలకు పాల్పడేందుకు ప్రయత్నించింది. అయితే, బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన మాదాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడు ఎరుకల మహేష్ (32) తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ ముఠాలో ఉన్న మరో ఏడుగురు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఈ ముఠాపై గతంలోనే మాదాపూర్ , KPHB పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి ఒక కారు, స్కూటీ, మొబైల్ ఫోన్లు, కంపెనీ స్టాంపులు , బ్యాంక్ పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అరెస్టు చేసిన వారిని రిమాండ్‌కు తరలించారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని, ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. కంపెనీల పూర్వాపరాలను పరిశీలించకుండా భారీ మొత్తంలో డబ్బులు చెల్లించి మోసపోవద్దని హెచ్చరించారు.

## VII రెండవ తరగతి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ స్టేషన్‌లో ఒక (1) స్పెషల్ మెట్రోపాలిటన్ పోస్టు

వెలుతురు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 10:

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, జిల్లా జడ్జి యూనిట్‌లో మార్నింగ్ కోర్టులకు అధ్యక్షత వహించడానికి VII రెండవ తరగతి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ స్టేషన్‌లో ఒక (1) స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌లు/సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌ల పోస్టుకు నియామకం కోసం ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్ జడ్జి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, మల్కాజిగిరి , కూషాయిగాడ వారు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని ఒక ప్రకటనలో తెలిపారు.

రెండవ తరగతి ప్రత్యేక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్లు/ప్రత్యేక జ్యుడిషియల్ మేజిస్ట్రేట్లు వారానికి 5 రోజులు (సోమవారం నుండి శుక్రవారం వరకు) ఉదయం 7.30 నుండి 10:30 వరకు కోర్టులను నిర్వహిస్తారని, వారికి నెలకు రూ.45,000/ ఏకీకృత గౌరవ వేతనం మరియు రూ. 5000/ (ప్రయాణ భత్యం) చెల్లించబడుతుందని పేర్కొన్నారు. నియమించబడిన ప్రత్యేక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్లు/రెండవ తరగతి ప్రత్యేక జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ల పదవీకాలం ఒక సంవత్సరం ఉంటుందన్నారు.

నోటిఫికేషన్ మరియు నిర్దేశిత దరఖాస్తు ఫారమ్‌ను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టుల వెబ్‌సైట్: districts.ecourts.gov.in/medchal నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

అర్హులైన అభ్యర్థుల నుండి అన్ని విధాలా పూర్తి చేసిన దరఖాస్తులను వాటికి జతచేసిన అనుబంధ పత్రాలతో పాటు, రెండు ప్రతులుగా ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్ జడ్జి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, మల్కాజిగిరి , కూషాయిగాడ కార్యాలయానికి తేదీ 17.04.2026 సాయంత్రం 5.00 గంటలకల్లా లేదా అంతకు ముందుగా పంపాలన్నారు.

**ఈ దిగువ తెలిపిన అర్హతలు కలిగి ఉండాలని సూచించారు.**

i) ప్రస్తుత ఉద్యోగి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉన్నత న్యాయ సేవ లేదా రాష్ట్ర న్యాయ సేవలో ఏదైనా పదవిని నిర్వహించి పదవీ విరమణ చేసి ఉండాలి లేదా రాజీనామా చేసి ఉండాలి, లేదా

ii) ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సర్వీస్/తెలంగాణ జ్యుడీషియల్ మినిస్టీరియల్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌లో హెడ్ క్లర్క్ / జిల్లా మున్సిఫ్ కోర్టు సూపరింటెండెంట్ హోదాకు తక్కువ కాని పదవిని నిర్వహించి, లా డిగ్రీని కలిగి ఉన్నవారు లేదా

iii) ఆంధ్రప్రదేశ్/తెలంగాణ హైకోర్టు సర్వీసులలో సెక్షన్ ఆఫీసర్ మరియు అంతకంటే పై స్థాయి పదవిని నిర్వహించి, లెవ్ డిగ్రీ లేదా

iv) బార్‌లో ఐదు సంవత్సరాల కంటే తక్కువ కాకుండా ప్రాక్టీస్ చేస్తున్న మరియు 45 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ప్రాక్టీస్ చేయని న్యాయవాది లేదా

v) న్యాయశాస్త్ర పట్టా కలిగి ఉన్న లేదా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే క్రిమినల్ జ్యుడిషియల్ టెస్ట్ (భారత శిక్షా స్మృతి మరియు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌తో కూడిన పూర్తి పరీక్ష) లో ఉత్తీర్ణులైన మరియు తన సర్వీసు కాలంలో కనీసం మూడు సంవత్సరాల పాటు మేజిస్టీరియల్ అధికారాలను వినియోగించిన ఏదేని విశ్రాంత గెజిటెడ్ అధికారి.

తగిన పదవీ విరమణ పొందిన న్యాయాధికారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

vii) 01.01.2026 నాటికి 65 సంవత్సరాల వయస్సును చేరుకోవడానికి కనీసం రెండు సంవత్సరాల సమయం ఉన్నవారు.

**2. అనర్హతలు:**

i) ప్రాక్టీసింగ్ అడ్వకేట్ లేదా

ii) ఏదైనా రాష్ట్ర లేదా స్థానిక అధికార సంస్థలో సభ్యుడైన వ్యక్తి, లేదా

iii) రాష్ట్ర శాసనసభ లేదా పార్లమెంటు సభ్యుడు లేదా

iv) రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వం లేదా ఏదైనా స్థానిక సంస్థ కింద పదవిని నిర్వహించి, దుష్ప్రవర్తన కారణంగా సర్వీసు నుండి తొలగించబడిన లేదా తీసివేయబడిన లేదా ఏదైనా ఇతర ప్రధాన శిక్షకు లోబడి నిర్బంధంగా పదవీ విరమణ చేసిన వ్యక్తి, లేదా

v) నైతిక దుష్ప్రవర్తనకు సంబంధించిన నేరానికి గాను కోర్టుచేత దోషిగా నిర్ధారించబడి, శిక్ష విధించబడిన వ్యక్తి లేదా నైతిక పతనానికి సంబంధించిన ఏదైనా నేరంపై అభియోగాలు ఎదుర్కొంటున్న మరియు విచారణలు పెండింగ్‌లో ఉన్న వ్యక్తి: లేదా

vi) దివాలా తీసిన వ్యక్తిగా లేదా విడుదల కాని దివాలాదారుగా తీర్పు పొందిన వ్యక్తి లేదా

vii) ఒక కాంట్రాక్టర్ లేదా వ్యాపారవేత్త లేదా కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం కోసం కొనసాగుతున్న కాంట్రాక్టు లేదా ఏదైనా పనిలో ఆసక్తి ఉన్న వ్యక్తి అర్హులు కారని స్పష్టం చేసారు.

viii) ఈ నోటిఫికేషన్‌కు ముందు అందిన దరఖాస్తులు/గడువు తేదీ తర్వాత అందిన దరఖాస్తులు పరిగణించబడవు.

**3. ప్రత్యేక మేజిస్ట్రేట్‌ల అధికారాల రద్దు:**

i) నియామకంపై మరియు సేవలో ఉన్నప్పుడు, ప్రధాన న్యాయాధికారి యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా వరుసగా మూడు కోర్టు సిట్టింగ్‌లకు హాజరు కానట్లయితే, రెండవ తరగతి ప్రత్యేక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌లు/ప్రత్యేక న్యాయాధికారులకు సంక్రమించిన అధికారాలను రద్దు చేయవచ్చు అని తెలిపారు.

ii) రెండవ తరగతి ప్రత్యేక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్లు/ప్రత్యేక జ్యుడిషియల్ మేజిస్ట్రేట్లు 65 సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాత స్వయంచాలకంగా తొలగించబడతాయి.

**4. దరఖాస్తు మరియు ఇతర సమాచారం:**

i) నియామక అధికారి ఎటువంటి కారణం చెప్పకుండా నోటిఫికేషన్‌ను రద్దు చేసే హక్కును కలిగి ఉంటారు.

ii) నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థి చేసే ప్రయాణానికి ఎలాంటి ప్రయాణ భత్యం చెల్లించబడదని వివరించారు.